# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | శుక్రవారం 12-2-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 165 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# గ్రేటర్ హైదరాబాద్ మేయర్‌గా గద్వాల విజయలక్ష్మి

మేయర్ గద్వాల విజయలక్ష్మి

### డిప్యూటీ మేయర్‌గా మోతె శ్రీలక్ష్మి ఎన్నిక
### ప్రశాంతంగా ముగిసిన గ్రేటర్ మేయర్ ఎన్నిక
### తొలుత కార్పొరేటర్లతో ప్రమాణస్వీకారం చేయించిన కలెక్టర్
### అనూహ్యంగా చివరి నిముషంలో మద్దతు తెలిపిన ఎంఐఎం

హైదరాబాద్,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): గ్రేటర్ హైదరాబాద్ కార్పోరేషన్ మేయర్‌గా గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌గా మోతె శ్రీలక్ష్మి ఎన్నికయ్యారు. చేతులెత్తే సంప్రదాయంతో వీరు ఎన్నికయ్యారు. ఎంఐఎం మద్దతుతో సిఎం కెసిఆర్ నిర్ణయించిన మేరకు వీరిని కొత్తగా ఎన్నికైన కార్పోరేటర్లు ఎన్నుకున్నారు. హైదరాబాద్ కలెక్టర్ శ్వేతామహంతి ఈ ఎన్నిక ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించారు. తొలుత మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్పొరేటర్లు ప్రమాణస్వీకారం చేశారు. జీహెచ్ఎంసీ కార్యాలయం లో ఎన్నికల నిర్వహణ అధికారి శ్వేతా మహంతి నూతన కార్పొరేటర్ల చేత ప్రమాణస్వీకారం చేయించారు. కార్పొరేటర్లు ఆయా భాషల్లో సామూహికంగా ప్రమాణం చేశారు. మొదట తెలుగు భాష, తర్వాత ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో కార్పొరేటర్లు ప్రమాణస్వీకారం చేశారు. కార్పొరేటర్ల ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఎక్స్ అఫిషియో సభ్యులు హాజరయ్యారు. మధ్యాహ్నం 12:30 గంటలకు మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక లాంఛనంగా పూర్తయ్యింది. అంతకుముందు టిఆర్ఎస్ భవన్‌లో కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లకు మంత్రి కెటిఆర్ దిశానిర్దేశం చేశారు. అనంతరం అంతా బస్సుల్లో జీహెచ్ఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా బంజారాహిల్స్ కార్పొరేటర్ గద్వాల విజయలక్ష్మి ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా తార్నాక కార్పొరేటర్ మోతె శ్రీలత ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల నిర్వహణ అధికారి శ్వేతా మహంతి అధికారికంగా ప్రకటించారు. మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు కార్పొరేటర్లకు శ్వేతామహంతి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన మేయర్ విజయలక్ష్మికి, డిప్యూటీ మేయర్ శ్రీలతకు టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు శుభాకాంక్షలు తెలిపారు. మేయర్‌గా విజయలక్ష్మి పేరును కార్పొరేటర్ బాబాఫసీయుద్దీన్ ప్రతిపాదించగా, గాజులరామారం కార్పొరేటర్ శేషగిరి బలపరిచారు. డిప్యూటీ మేయర్‌గా శ్రీలత పేరును మచ్చబొల్లారం కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ ప్రతిపాదించగా, కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ బలపరిచారు. అనంతరం ఎన్నికల నిర్వహణ అధికారి శ్వేతా మహంతి ఎన్నిక పక్రియ చేపట్టారు. చేతులెత్తే విధానం ద్వారా మేయర్‌ను ఎన్నుకున్నారు. మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థులకు ఎంఐఎం మద్దతు ఇచ్చింది. మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నప్పటికీ.. ఈ ప్రక్రియ ఎలాంటి సంచలనాలు లేకుండా సాఫీగా సాగిపోయింది. మేయర్, డిప్యూటీ మేయర్ అభ్యర్థులు ఎవరు అనే అంశంపై గత నాలుగైదు రోజుల నుంచి ఉత్కంఠ కొనసాగింది. ఉదయం నుంచి మేయర్‌గా గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌గా మోతె శ్రీలత పేర్లను ప్రతిపాదించినట్లు వార్తలు వచ్చాయి. అయినప్పటికీ అందరిలో ఒక రకమైన ఉత్కంఠ ఉండింది. మొత్తానికి ఎలాంటి హంగామా లేకుండా మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియ పూర్తయింది. మేయర్ గద్వాల విజయలక్ష్మి విద్యాభ్యాసం మొత్తం హైదరాబాద్‌లోనే కొనసాగింది. పాఠశాల విద్య హైదరాబాద్‌లోని హోలీ మేరీ స్కూల్లో పూర్తిచేశారు.

టిఆర్ఎస్ భవన్‌లో కొత్తగా ఎన్నికైన కార్పోరేటర్లకు మంత్రి కెటిఆర్ దిశానిర్దేశం చేశారు.

డిప్యూటీ మేయర్ మోతె శ్రీలక్ష్మి

రెడ్డి ఉమెన్స్ కాలేజీలో ఇంటర్, భారతీయ విద్యాభవన్‌లో జర్నలిజం చేశారు. సుల్తాన్ ఉల్ లూమ్ లా కాలేజీలో న్యాయవిద్యను అభ్యసించారు. వివాహానంతరం ఆమె 18 ఏండ్లపాటు అమెరికాలో ఉన్నారు. ఆ సమయంలో ఉత్తర కరోలినాలోని డ్యూక్ యూనివర్సిటీ కార్డియాలజీ డిపార్ట్‌మెంట్‌లో రిసెర్చ్ అసిస్టెంట్‌గా పనిచేశారు. 2007లో అమెరికా పౌరసత్వాన్ని వదులుకొని భారత్‌కు తిరిగి వచ్చారు. అప్పటి నుంచి ఆమె రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారు. 2016లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ నుంచి బంజారాహిల్స్ కార్పొరేటర్‌గా భారీ విజయం సాధించారు. డివిజన్ అభివృద్ధికి తనవంతుగా కృషిచేశారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత తార్నాక నుంచి ఎన్నికయ్యారు. కొంతకాలం పాటు టీఆర్ఎస్ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మంత్రులు తలసాని, మహమూద్ అలీలు హాజరైన వారిలో ఉన్నారు.

# అందరినీ కలుపుకుని పోతా

### మహిళలకు మరింత ప్రాధాన్యం ఇస్తా
### తనను ఎన్నుకున్నందుకు కెసిఆర్,కెటిఆర్‌లకు విజయలక్ష్మి కృతజ్ఞతలు

హైదరాబాద్,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ఎన్నికైన గద్వాల విజయలక్ష్మి.. ముఖ్యమంత్రి కేసీఆర్, టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం అందరి సలహాలు స్వీకరిస్తాను అని పేర్కొన్నారు. నగరంలో మహిళలకు మరింత భద్రత కల్పిస్తాను అని స్పష్టం చేశారు. అవినీతిపై పోరాటం కోసం ఎంత దూరమైన వెళ్తాను అని తేల్చిచెప్పారు. మేయర్‌గా, డిప్యూటీ మేయర్‌గా ఒకేసారి ఇద్దరు మహిళలకు అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రికి మరోసారి కృతజ్ఞతలు తెలుపుతున్నానని విజయలక్ష్మి పేర్కొన్నారు. సమస్యల విషయంలో రాజీపడేది లేదని, అలాగే అధికార,విపక్ష పార్టీలు అన్న వివక్ష లేకుండా అందరిని కలుపుకుని ముందుకు సాగుతానని ప్రకటించారు. తనకు అందరూ సమానమేనని అన్నారు.

# మేయర్,డిప్యూటీ మేయర్లకు కెటిఆర్ తదితరుల అభినందన

హైదరాబాద్,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ: జీహెచ్ఎంసీ మేయర్‌గా ఎన్నికైన గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతకు మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్ణయం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి బంజారాహిల్స్ డివిజన్ ఇంచార్జ్‌గా ఉన్నారు.

ఈ మేరకు ఎన్నికల నిర్వహణ అధికారి శ్వేతా మహంతి అధికారికంగా ప్రకటించారు. మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు కార్పొరేటర్లకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్‌లకు టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు శుభాకాంక్షలు తెలిపారు.

# హైదరాబాద్‌కు ఇద్దరు మహిళల ఎంపిక అమోఘం

### మేయర్,డిప్యూటీ మేయర్‌లను అభినందించిన సత్యవతి

హైదరాబాద్,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): చారిత్రాత్మక నగరం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు మేయర్‌గా గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌గా శ్రీలతా శోభన్ రెడ్డి ఎన్నికపై స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాస్మోపాలిటన్ సిటీగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరానికి మేయర్, డిప్యూటీ మేయర్‌గా ఇద్దరు మహిళలను ఎంపిక చేయడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. మహిళల పట్ల తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉన్న నమ్మకానికి, గౌరవానికి జీహెచ్ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్ అభ్యర్థుల ఎంపికే నిదర్శనమన్నారు. మహిళల సాధికారతకు ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, ఇది దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. నూతనంగా ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్ నాయకత్వంలో హైదరాబాద్ ప్రతిష్ట మరింత పెరుగుతుందని ఆకాంక్షించారు.

# సంక్షేమంలో కెసిఆర్‌ను మించిన నేత లేడు

### -రైతు బంధుతో దేశానికి దిశానిర్దేశం చేశారు: ఎమ్మెల్యే

మెదక్,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): సంక్షేమంలో కెసిఆర్‌ను మించిన నేత లేడని మెదక్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటి స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. కేసీఆర్‌ను పేదలు పెద్దన్నగా.., ఆడబిడ్డలకు మేనమామగా పిలుస్తున్నారన్నారు. రైతుబంధు ద్వారా కేంద్రం కూడా ఆదిశగా పనిచేసేలా చేయడంలో కెసిఆర్ విజయం సాధించారని అన్నారు. పేదల కష్టాలు తెలిసిన నాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. ఆడబిడ్డల పెండ్లికి ఆర్థిక ఇబ్బందులు రాకూడదనే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రారంభించారని అన్నారు. ఆడ పిల్లలంటే ఇంటికి లక్ష్మి అని, వారిని మగ పిల్లలతో సమానంగా చదివించాలన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే ఇంగ్లీష్ మీడియం, రెసిడెన్షియల్ పాఠశాలలు స్థాపించి బాలికలకు నాణ్యమైన విద్యనందిస్తున్నారని చెప్పారు. గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య పరీక్షలతో పాటు ప్రసవం అనంతరం రూ.12 వేలు, కేసీఆర్ కిట్‌ను అందజేస్తున్నారని తెలిపారు. మహిళల కోసం మరిన్ని డ్వాక్రా పథకాలు ప్రారంభించి స్వయం ఉపాధితో అన్ని రంగాల్లో ముందంజలో ఉండేలా టీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కల్యాణలక్ష్మి పథకంతో పేదలకు ఆదరణ పెరిగిందన్నారు. కొత్తగా ఏర్పడిన సర్పంచ్‌ల్లో సగం మంది మహిళలే ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి కృషి చేస్తానన్నారు.

రెవెన్యూ సిబ్బంది కల్యాణలక్ష్మి పథకంతో పాటు ఆరోగ్య భద్రత వంటి పథకాలను ప్రజలకు అందించడం లో ముందంజలో ఉండాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు.పట్టాదారు పాస్ పుస్తకాలు, భూ సమస్యలను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

# పోలీసులు టిఎస్‌జిఎల్ఐ పాలసీ కలిగి ఉండాలి

### -కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్, ఫిబ్రవరి 11: (నేటినిజం ప్రతినిధి):అన్నిస్థాయిలకు చెందిన పోలీసులు టిఎస్‌జిఎల్ఐ పాలసీని పొందాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన ప్రతి ఉద్యోగి ఈ పాలసీకి అర్హులని పేర్కొన్నారు.

గురువారంనాడు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో టిఎస్‌జిఎల్ఐ అధికారులు పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వఉద్యోగులకు ఈ పాలసీ ఓ వరంలాంటిదన్నారు. ప్రతినిత్యం వివిధ సవాళ్ళను ఎదుర్కొంటూ విధులను నిర్వర్తించే పోలీసులు ఈ పాలసీని చేయించడానికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ప్రభుత్వం తరపున జీవితభీమాను అందిస్తున్న ఏకైకసంస్థ టిఎస్‌జిఎల్ఐ అని పేర్కొన్నారు. 21నుండి 53సంవత్సరాల వయస్సుకలిగిఉన్న ప్రతి ప్రభుత్వఉద్యోగి ఈ పాలసీ పొందడానికి అర్హులని చెప్పారు. గతంలో ఏపిజిఎల్ఐగా కొనసాగిన ఈ సంస్థ తెలంగాణరాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుండి టిఎస్‌జిఎల్ఐగా మారిందని తెలిపారు.

అడిషనల్ డిసిపి(పరిపాలన)జి చంద్రమోహన్ మాట్లాడుతూ మూడుసంవత్సరాల సర్వీసు పూర్తిచేసుకున్న ప్రతి పోలీసు ఉద్యోగి తన బేసిక్‌లో 20శాతం వరకు ఈ పాలసీ చేసుకోవచ్చున్నారు. ఆదాయపుపన్ను నుండి మినహాయింపు లభిస్తుందనే విషయాన్ని గుర్తించాలని చెప్పారు. టిఎస్‌జిఎల్ఐ జిల్లా సహాయ సంచాలకులు యంవి ముర్తుజా మాట్లాడుతూ భీమామొత్తాన్ని నెలజీతంలో రికవరీ పెంపుదల చేసిన సందర్భంలో సంబంధితబాండ్లను వెబ్‌సైట్‌ద్వారా పొందాలన్నారు. వివిధ రకాల బాండ్లను పొందడం కోసం www.tsgli.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. పాలసీదారులు తమపాలసీ నెంబర్ మరచిపోయినా పుట్టినతేదీ, తండ్రిపేరు ఆధారంగా బాండ్లను పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ పాలసీకోసం ఎలాంటి వైద్యపరీక్షలు అవసరం లేదని చెప్పారు.

# టీఆర్ఎస్,ఎంఐఎ దోస్తీ బయటపడింది

### వారిద్దరు కలిసి ప్రజలను మోసం చేశారు
### ఎమ్మెల్యే రాజాసింగ్ మండిపాటు

హైదరాబాద్,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): ఇద్దరు దొంగలు కలిసి మేయర్ పీఠాన్ని గెలుచుకున్నారని టీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ధ్వజమెత్తారు. నగర మేయర్ పీఠాన్ని టీఆర్ఎస్ కైవసం చేసుకున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. టీఆర్ఎస్, ఎంఐఎం రెండూ కలిసి ప్రజలను మోసం చేశాయని ఆయన ఆరోపించారు. వారిద్దరి బంధం మరోమారు ప్రజలకు తెలిసిందన్నారు. టీఆర్ఎస్‌లో కొనసాగే అంశంపై ఆలోచించుకోవాలని టీఆర్ఎస్ కార్పొరేటర్లకు ఆయన సూచించారు. గతంలో టిఆర్ఎస్‌తో సంబంధం లేదన్న వారు వారి మద్దతు ఎలా తీసున్నారని ప్రశ్నించారు. గత పాలకమండలిలో టీఆర్ఎస్, ఎంఐఎం కలిసి ప్రజల సొమ్మును దోచుకున్నాయని రాజాసింగ్ పేర్కొన్నారు.మళ్ళీ కోట్ల రూపాయలను దోచుకోవటానికి టీఆర్ఎస్, ఎంఐఎం కలిసి ప్రణాళికలు రచించాయని ఆయన అన్నారు. ఎంఐఎంతో కలిసి టీఆర్ఎస్ తన గోతిని తానే తవ్వుకుందని ఆయన తెలిపారు. గ్రేటర్ ఎన్నికల్లో ఎంఐఎంతో కలిసి పోటీ చేసి ఉంటే టీఆర్ఎస్‌కు 15సీట్లు కూడా వచ్చేవి కాదని రాజాసింగ్ పేర్కొన్నారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ రేకంటు నిగా నాతపరి
రాకాశశిగా నాకపరి ప్రజలను గాలవక్
శ్రీ రంధు డు గురియు దంయూ
శకశమలు "చౌదరి అజిత్‌సింగ్" పయన్!!

(ఫిబ్రవరి 12 మాజీ ప్రధాని చరణ్‌సింగ్ కుమారుడు అజిత్‌సింగ్ జననం..)

-రాధశ్రీ

సెల్: 9494481210

# నగర వైభవాన్ని మరింత పెంచాలి.. జీహెచ్ఎంసీ కార్పొరేటర్లకు సీఎం కేసీఆర్ పిలుపు

హైదరాబాద్, ఫిబ్రవరి11: విభిన్న ప్రాంతాలు, విభిన్న సంస్కృతులకు చెందిన ప్రజలు నివాసముంటున్న హైదరాబాద్ నగరం అసలు సిసలైన విశ్వనగరంగా, మినీ ఇండియాగా భాసిల్లుతున్నదని, ఈ నగర వైభవాన్ని మరింత పెంచే విధంగా కొత్తగా ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు పాటుపడాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పిలుపునిచ్చారు. కొత్తగా ఎన్నికైన జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా రెడ్డి, టీఆర్ఎస్ కార్పొరేటర్లు గురువారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం వారిని అభినందించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కార్పొరేటర్లకు కర్తవ్యబోధ చేశారు.

మంచి పేరు తెచ్చుకోవడం గొప్ప విషయం..

కోట్లాది మందిలో కేవలం కొద్ది మందికి మాత్రమే సందర్భం కలిసి వచ్చి ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యే అవకాశం వస్తుంది. అది గొప్ప విషయం కాదు. ప్రజాప్రతినిధిగా ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజా జీవితంలో మంచి పేరు తెచ్చుకోవడం గొప్ప విషయం.

మంచిగ ఉంటేనే బట్టకాల్చి మీదేసే రోజులివి. కొద్దిగా అవకాశం ఇస్తే చాలా చెడ్డపేరు వస్తుంది. కాబట్టి చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పదవిలో ఉన్న వారు ఎంతో సంయమనంతో, సహనంతో, సాదాసీదాగా ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లో సహజత్వం కోల్పోవద్దు. వేష, భాషల్లో మార్పులు రావద్దు. అసంబద్ధంగా, అవసరం లేని మాటలు మాట్లాడితే వచ్చే లాభమేమీ లేకపోగా కొన్ని సందర్భాల్లో వికటించే అవకాశం ఉంటుంది. కాబట్టి జాగ్రత్తగా మాటాడాలి. మీ దగ్గరికి వచ్చే వాళ్ల కులం, మతం చూడవద్దు. ప్రతీ ఒక్కరిని ఆదరించాలి. అక్కున చేర్చుకోవాలి. వారికి సరైన గౌరవం ఇవ్వాలి. వారు చెప్పేది ఓపిగ్గా వినాలి. చేతనయినంత సాయం చేయాలి. అబద్ధాలు చెప్పవద్దు. సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో ప్రయత్నించాలన్నారు.

ఈ పాట వందలసార్లు విన్నా..

గల్లీ చిన్నది గరీబోళ్ల కథ పెద్దది అనే గోరటి వెంకన్న పాట వినండి. నేను వంద సార్లు విన్నా. అందులో బస్తీల్లో ఉండే పేదల కష్టాలు, గోసలున్నాయి. వాటిని అర్థం చేసుకోవాలి. మేయర్, కార్పొరేటర్లు బస్తీల్లో పర్యటించాలి. వారి బాధలు అర్థం చేసుకోవాలి. పేదలను ఆదరించాలి. బస్తీ సమస్యలు తీర్చాలి.అదే ప్రధాన లక్ష్యం కావాలని ప్పారు.

అందరినీ ఆదరించే ప్రేమగల్ల నగరం..

అందరినీ ఆదరించే ప్రేమగల్ల నగరం హైదరాబాద్ అని సీఎం కేసీఆర్ అన్నారు. హైదరాబాద్ నగరానికి అనేక అనుకూలతలున్నాయి. మంచి భవిష్యత్ ఉన్నది. నిజమైన విశ్వనగరమిది. బయటి రాష్ట్రాల నుంచి కూడా వచ్చి ఇక్కడ స్థిరపడిన అనేక మంది ఉన్నారు. నగరంలో సింధ్ కాలనీ, గుజరాతీ గల్లీ, పార్సీగుట్ట, బెంగాలీలు, మలయాళీలు, మార్వాడీలు, ఖాయస్తులున్నారు. ఇలా విభిన్న ప్రాంతాల వారు, విభిన్న మతాల వారు, విభిన్న సంస్కృతుల వారున్నారు. వారంతా హైదరాబాదీలుగా గర్విస్తున్నారు. హైదరాబాద్ ఓ మినీ ఇండియాలాగా ఉంటుంది. అందరినీ ఆదరించే ప్రేమగల్ల నగరం. ఇంత గొప్ప నగరం భవిష్యత్తు కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్ల మీద ఉన్నది. మీరు గొప్పగా పనిచేసి ఈ నగర వైభవాన్ని పెంచాలి. అన్ని వర్గాల ప్రజలను ఆదరించాలి. ప్రభుత్వం కూడా హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేయడానికి అనేక కార్యక్రమాలు చేపడుతుంది. వాటికి సహకరించాలని పేర్కొన్నారు.

అందరికీ ఇవ్వలేము..

ఇంత మంది కార్పొరేటర్లున్నారు. కానీ ఒక్కరికే మేయర్ గా అవకాశం దక్కుతుంది. మీలో మేయర్ కావాల్సిన అర్హతలున్న వారు చాలా మంది ఉన్నారు. కానీ అందరికీ ఇవ్వలేము. నా పరిస్థితుల్లో మీరున్నా అంతే చేయగలరు. అర్థం చేసుకుని, అందరూ కలిసి కట్టుగా ఈ నగరాన్ని ముందుకు తీసుకుపోవాలని సీఎం కేసీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటరీ పార్టీ నాయకుడు కె.కేశవ రావు, రాజ్యసభ సభ్యులు సురేష్ రెడ్డి, సంతోష్ కుమార్, మంత్రులు తలసాని శ్రీనివాస్, మహమూద్ అలీ, ఇంద్రకరణ్ రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మేయర్ గద్వాల విజయలక్ష్మి , డిప్యూటీ మోతె శ్రీలక్ష్మి.

# చివరి వరకు కొనసాగిన ఎంఐఎం సస్పెన్స్

### చివరి నిమిషంలో అధికార టిఆర్ఎస్‌కు మద్దతు
### తామూ బరిలో ఉంటామని చెప్పి గులాబీకి గులామ్
### కెసిఆర్ వ్యూహంతో రెండు పోస్టులు టిఆర్ఎస్‌కే
### మేయర్ పదవిని ఆశించి భంగపడ్డ పిజెఆర్ తనయ
### ప్రమాణస్వీకారం అనంతరం ఎన్నిక బహిష్కరణ

హైదరాబాద్,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ నగర పాలక సంస్థ ఎన్నికల్లో బిజెపి ముందునుంచి అనుమానిస్తున్నట్లుగానే ఎంఐఎం అధికార టిఆర్ఎస్‌కు మద్దతు తెలిపింది. దీంతో అధికార టిఆర్ఎస్ అభ్యర్థులు మేయర్, డిప్యూటి మేయర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బిజెపి తమ అభ్యర్థలను నిలిపినా లాభం లేకుండా పోయింది. మొత్తానికి మేయర్ ఎంపిక ఉత్కంఠకు తెరపడింది. జీహెచ్ఎంసీ మేయర్ పీఠంపై అధికార టీఆర్ఎస్ జెండా ఎగరేసింది. ముందునుంచి ఊహించినట్లే గులాబీ బాస్, ముఖ్యమంత్రి కెసిఆర్ హత్మకంగా వ్యవహరించి మేయర్, డిప్యూటీ మేయర్ పీఠాలను దక్కించుకున్నారు. గ్రేటర్‌లో బీజేపీ దూకుడును సునాయాసంగా ఎదుర్కొన్నారు. మిత్రపక్షం ఎంఐఎంతో కలిసి టీఆర్ఎస్ గ్రేటర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. అయితే ఎన్నిక సందర్భంగా ఎంఐఎం పార్టీ వ్యవహరించిన తీరు ఆశ్చర్యానికి గురిచేసింది. మేయర్ బరిలో తాము కూడా ఉంటామని తొలినుంచి ప్రచారం చేసిన ఎంఐఎం పార్టీ చివరి నిమిషంలో ప్లేటు ఫిరాయించింది. కీలకమైన సమయంలో అధికార టీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించింది. మేయర్ అభ్యర్థిని బరిలో నిలపకుండా టీఆర్ఎస్ అభ్యర్థి గద్వాల విజయలక్ష్మి విజయానికి మద్దతుగా నిలిచింది. మేయర్ అభ్యర్థులుగా టీఆర్ఎస్ నుంచి విజయలక్ష్మి, బీజేపీ నుంచి మేయర్ అభ్యర్థి రాధా ధీరజ్‌రెడ్డి పోటీలో నిలిచారు. ఎన్నిక పక్రియను చేపట్టిన హైదరాబాద్ కలెక్టర్ శ్వేతా మహంతి.. నియమ నిబంధనల ప్రకారం మేయర్ ఎన్నిక పక్రియను చేపట్టారు. కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లతో పాటు వివిధ పార్టీలకు చెందిన ఎక్స్ అఫిషియో సభ్యులు కౌన్సిల్ హాల్‌లో కూర్చున్నారు. అనంతరం పోటీలో నిలిచిన ఇద్దరు సభ్యులకు ఎక్కువ మంది సభ్యులు ఎవరికి మద్దతు తెలిపితే వారిని విజేతలు ప్రకటిస్తామన్నారు. దీంతో అధికార టీఆర్ఎస్ అభ్యర్థికి ఎక్కువ మంది మద్దతు తెలపడంతో విజయం సాధించారు. అంతకుముందు జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం పూర్తి చేశారు. అప్పటికే టీఆర్ఎస్ మేయర్, డిప్యూటీ మేయర్‌ల పేర్లు ఖరారైపోయాయి. అయితే ఆశావహులు భారీగానే ఉన్నారు. కానీ అధిష్టానం టీఆర్ఎస్ మేయర్ అభ్యర్థిగా కేశవరావు కుమార్తె గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌గా మోతె శ్రీలతను అధిష్టానం ఎంపిక చేసారు. దీంతో మేయర్ పీఠంపై ఆశలు పెట్టుకున్న ఖైరతాబాద్ కార్పొరేటర్, పీజేఆర్ కూతురు విజయారెడ్డి అలకబూనారు. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఆమె మేయర్ ఎన్నికలో పాల్గొనకుండానే అక్కడి నుంచి కారెక్కి వెళ్లిపోయారు. దీంతో టీఆర్ఎస్ నేతలు కంగుతిన్నారు. ఆమెకు ఎవరు ఫోన్ చేసినా పలకలేదు. గతంలో కూడా విజయారెడ్డికి మేయర్ పీఠం దక్కుతుందని పీజేఆర్ అభిమానులు, అనుచరులు భావించారు. అప్పుడు కూడా టీఆర్ఎస్ అధిష్టానం ఆమెను నిరాశపరిచింది. ఈసారైనా మేయర్ పీఠం దక్కుతుందని ఆమె భావించారు కానీ ఈసారి కూడా మొండి చెయ్యి చూపించడంతో విజయారెడ్డి తీవ్ర అసంతృప్తికి లోనై మేయర్ ఎన్నికల్లో పాల్గొనకుండా వెళ్లిపోయారు. ఉత్కంఠ బరితంగా సాగిన ఈ ఎన్నికల్లో చివరికి కారు పార్టీనే పైచేయి సాధించింది. మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్ పదవులను కైవసం చేసుకుని చారిత్రాత్మక నగరంపై మరోసారి గులాబీ జెండా ఎగరేసింది. ముందు నుంచి అందరూ ఊహించినట్లే మేయర్ పీఠం టీఆర్ఎస్ పార్టీ విధేయులనే వరించింది.రాజ్యసభ సభ్యులు కే కేశవరావు కుమార్తె గద్వాల విజయలక్ష్మిని జీహెచ్ఎంసీ మేయర్‌గా సభ్యులు ఎన్నుకున్నారు. అలాగే డిప్యూటీ మేయర్‌గా మోతె శ్రీలత శోభన్‌రెడ్డి ఎన్నికయ్యారు.

విజయలక్ష్మి బంజారాహిల్స్ డివిజన్ నుంచి వరుసగా రెండోసారి విజయం సాధించగా.. శ్రీలత తార్నాక నుంచి గెలుపొందారు. విజయలక్ష్మి ఎన్నికతో ఆమె ఇంటి వద్ద కూడా సందడి నెలకొంది. ఆమె మేయర్‌గా ఎన్నిక కావడంతో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి మేయర్ పదవి దక్కిన వారిలో రెండోవారు అయ్యారు. 1961లో ఖైరతాబాద్ కార్పొరేటర్‌గా గెలిచిన ఎంఆర్ శ్యామ్‌రావు మేయర్‌గా పనిచేసిన విషయం తెలిసిందే.

మేయర్ పీఠం కోసం తొలినుంచి అధికార టీఆర్ఎస్‌లో విపరీతమైన పోటీ నెలకొన్న విషయం తెలిసిందే. సింధు ఆదర్శ్‌రెడ్డి (భారతీనగర్)తో పాటు మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ సతీమణి శ్రీదేవి, పీజేఆర్ కుమార్తె విజయారెడ్డి పేర్లు సైతం ప్రముఖంగా వినిపించాయి. అయితే రాజకీయ, సామాజిక సమీకరణాలు దృష్టిలో ఉంచుకుని వ్యూహాత్మకంగా వ్యవహరించిన గులాబీ బాస్ కేసీఆర్ చివరి నిమిషంలో కేకే కుమార్తెను ఖరారు చేశారు. అయితే విజయారెడ్డి సైతం మేయర్ పీఠంపై గంపెడు ఆశలు పెట్టుకున్నప్పటికీ సీఎం కేసీఆర్ అనూహ్యంగా విజయలక్ష్మి పేరును ఖరారు చేశారు. మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలో ఎంఐఎం పార్టీ టీఆర్ఎస్‌కు మద్దతు తెలిపింది. సభ్యులు చేతులెత్తి మేయర్‌ను ఎన్నుకున్నారు. సంఖ్యా పరంగా టీఆర్ఎస్‌కు ఎక్కువమంది సభ్యుల మద్దతు ఉండటంతో మేయర్ పీఠాన్ని టీఆర్ఎస్ కైవసం చేసుకుంది. దీంతో జైశ్రీరాం అంటూ బీజేపీ సభ్యులు నినాదాలు చేశారు. ఎంఐఎం మద్దతు తీసుకోవడంపై బిజెపి సభ్యులు నినాదాలు చేస్తూ టీఆర్ఎస్ తీరుపై మండిపడ్డారు.

# తెలంగాణ ప్రజలు అప్రమత్తం కావాల్సిందే ..!

నేటి నిజం
శుక్రవారం 12-2-2021

మొన్నటి దాకా బంగారు తెలంగాణ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ ..ఆ కల సాకారం కాలేదు. తెలంగాణ ఏర్పడితే అంతా మంచే జరుగుతుందనుకున్న వారు మోసపోయారు. బలిదానాలు ఇచ్చిన వారి కుటుంబాలు అనాథలే అయ్యాయి. ప్రజలకు ఊరట దక్కలేదు. నిరుద్యోగులకు ఉద్యోగాలు దక్కలేదు. ఉపాధి కోసం ఎదురు చూసిన వారి కళ్లు కాయలు కాస్తున్నాయి. యూనివర్సిటీల్లో విలువ మొదలు అధ్యాపకుల నియామకాలు లేవు. నీళ్లు ,నిధులు, నియామకాలు అన్న నినాదం మంటలో కలిసి పోయింది. తెలంగాణ ఉద్యమ జెండా మోసిన వారంతా దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తున్నా పట్టించుకునే వారు లేరు. జెండాలు మోసిన జర్నలిస్టులు అధోగతి పాలయ్యారు. వారిని పురుగుల కన్నా హీనంగా చూస్తున్నారు. చిన్న పత్రికలకు పాడె కట్టారు. ఒక్కో చిన్నపత్రిక ఒక్కో స్టార్టప్ అని గుర్తించడం లేదు. ఒక్కో పత్రికను ఆధారం చేసుకుని పది నుంచి 20మంది బతుకు వెళ్లదీస్తుంటే ప్రత్యేక తెలంగాణలో వారి నోట్లో మట్టి కొట్టారు. వారిని బతకకుండా చేశారు. అధికారిక పత్రికలకు తప్ప ఇతరాలైన పత్రికలకు ప్రకటనలు ఇవ్వకుండా ఎండబెట్టారు. ఏ పని చేసినా ఓట్లు రాబట్టుకునే ఆలోచనలో తెలంగాణ ప్రభుత్వం నడుస్తోంది. దానినే బంగారు తెలంగాణ అంటూ ఊదర గొడుతున్నారు. ఈ క్రమంలో ఇటీవలే బిజెపి టిఆర్ఎస్‌కు కొంత ఝలక్ ఇచ్చింది. ఈ దశలో ఇప్పుడు రాజన్న రాజ్యం.. అంటూ షర్మిల ఊడిపడ్డారు. ప్రజలను వంచించడానికి ..దోపిడీకి మరో ఎత్తు వేస్తూ దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయ షర్మిలమ్మ హఠాత్తుగా తెలంగాణ గడ్డపై ఊడిపడింది. ఎపిలో అన్న చేస్తున్న రాజ్యం ఎలా ఉందో ఏనాడూ ఆమె ప్రశ్నించలేదు. అక్కడ ప్రజలు ఎలా ఉన్నారో ఎప్పుడూ ఆరా తీయలేదు. అక్కడ అరాచకాలు ఎందుకు జరుగుతున్నాయో కనుక్కోలేదు. ఒక్క అవకాశం అంటూ గద్దె నెక్కిన జగన్ పాలన ఎలా ఉందో ప్రపంచమంతా చూస్తోంది. అవినీతి కేసుల్లో కూరుకుపోయిన ఓ నేత ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు. పోతిరెడ్డుపాడు ద్వారా ఉన్న కృష్ణా నీటిని తరలించుకుని పోతున్నా సిఎం కెసిఆర్ కిమ్మనడం లేదు. సంగంబండ రిజర్వాయర్ నిర్మాణాలు చకచకా సాగుతున్నా పట్టించుకోవడం లేదు. ఉమ్మడి ఎపిలో ఉన్న నీటి పంచాయితీలే మరింత ఎక్కువగా మళ్లీ మళ్లీ ఉత్పన్నం అవుతున్నాయి. నేనున్నంత వరకు తెలంగాణకు అన్యాయం జరగదన్న మన సిఎం కెసిఆర్ అసలు దాని గురించి పట్టించుకోవడం లేదు. ఇక తెలంగాణలో రాజన్నరాజ్యం అంటూ వచ్చిన షర్మిల ఈ ప్రాంత ప్రజలను ఏ విధంగా ఉద్దరిస్తారో ముందు.. ఎపికి వెళ్లి అక్కడ అమలు చేస్తున్న తీరును పరిశీలించి ఉంటే బాగుండేది. కానీ అలా జరగలేదు. ఏకంగా రాజన్న రాజ్యం అంటూ కడప నుంచి ఊడిపడ్డారు. తెలంగాణలో వైఎస్ పేరిట పార్టీ ఏర్పాటు ప్రయత్నాలపై అనుచరుల ద్వారా లీకుల బాణాలు వదిలి, పరోక్షంగా ఖండించిన వైఎస్ షర్మిల ఎట్టకేలకు వాటినే నిజం చేస్తూ.. తమ అధికారక బంగ్లాలో కొందరిని పిలిచి మాట్లాడడం...రాజన్న రాజ్యం తెస్తామనడం.. చూస్తుంటే మరో దోపిడీకి తెలంగాణను గురికాబోతున్నదని ప్రజలు గుర్తించాలి. ప్రజల అమాయకత్వాన్ని, అవసరాలను క్యాష్ చేసుకోవడం నేటి రాజకీయంగా మారింది. ప్రజలకు మేలు చేయాలన్న చిత్తశుద్ధి లోపించింది. కేంద్రంలో ఉన్న బిజెపి రామరాజ్యం పేరుతో ఊదర గొడుతూ దేశ ప్రజలను ఇప్పటికే కర్రుకాల్చి వాతలు పెడుతోంది. జిఎస్టీ, నోట్ల రద్దుతో ప్రజలు లేవకుండా చేసింది. ఈ దశలో ఏ పార్టీ వచ్చినా ప్రజలకు ఒరిగేదేమీ లేదని తేలిపోయింది. ఏ రాయైతే నేమీ పళ్లూడ గొట్టుకోవడానికి అన్న చందంగా రాజకీయ పార్టీలు తయారయ్యాయి. లోటస్‌పాండ్‌లో ఆత్మీయ సమ్మేళనం అంటూ జరిగిన రాజకీయ హడావిడి చూస్తుంటే ..అర్థంలేకుండా ఆమె ఎందుకు ఊడిపడ్డారన్నది అర్థం చేసుకోవాలి. తెలంగాణలో ధైర్యంగా రాజకీయ పార్టీని పెడతాననడం వెనక ఎవరి హస్తం ఉందన్నది గమనించాలి. ఎవరి రాజకీయ ప్రయోజనాల కోసం ఆమె జెండా ఎత్తబోతున్నారో ప్రజలు గమనించాలి. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో అన్న పార్టీ వైకాపా పోటీలోంచి తప్పుకుంది. ఎంతో కొంత ప్రభావం ఉన్న టిడిపి పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా గిలగిలా కొట్టుకుంటోంది. ఈ దశలో హఠాత్తుగా దిగిన షర్మిల తెలంగాణలో రాజన్నరాజ్యం ఎందుకు లేదు అని ప్రశ్నించడం చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. అంటే ఏపిలో ప్రజల కష్టాలు లేవనా? ఎపి నుంచి విడివడ్డ ప్రత్యేక తెలంగాణలో అదెలా ఉంటుందన్న ఇంగితం లేకుండా ప్రశ్నించడం.. అనుయాయులు చప్పట్లు కొట్టడం అంతా ఓ డ్రామాగా కనిపించింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరవాత కెసిఆర్ గులాబీ పాలన సాగుతున్న చోట రాజన్నరాజ్యం ఎలా వుంటుందన్న ప్రాథమిక ప్రశ్న కూడా ఆమెకు కలగలేదా అన్న అనుమానం మనకు కలుగుతోంది. ఒకప్పుడు జగనన్న వదిలిన బాణాన్ని అంటూ ప్రచారం చేసుకున్న షర్మిల ఇప్పుడు ఎవరు ప్రయోగిస్తే ఇక్కడ వచ్చిపడిందన్నది తెలంగాణ ప్రజలు ఆలోచన చేయాలి. నిజానికి ఎపిలో రాజన్నరాజ్యం నడవాలి. కానీ అక్కడంతా అరాచక రాజ్యం నడుస్తోంది. రాజధాని అన్నది లేకుండా...మూడు రాజధానులు ఉండాలన్న విపరీత ఆలోచనలు చేస్తున్న పాలకులు ఉన్నారు. రాజధాని లేకుండా రాజ్యం చేస్తున్నారు. అలా ఎందుకు చేస్తున్నారో తెలియదని కాదు. చంద్రబాబు టిడిపి అధికారంలో ఉన్నా..కెసిఆర్ టిఆర్ఎస్ అధికారంలో ఉన్నా తెలంగాణకు జరిగింది శూన్యం. పార్టీలు పెట్టి..ప్రజలను కొల్లగొట్టు అన్న రీతిలో రాజకీయాలు సాగు తున్నాయి. ఈ కోవలోనే షర్మిలమ్మ ప్రయత్నాలు ఉంటాయనడంలో ఎలాంటి సందేహాలు అవసరం లేదు. తెలంగాణలో పార్టీ విస్తరణ, పోటీకి జగన్ ఒప్పుకోలేదని ఆయన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడించారు. ఇదే సలహా షర్మిలకు కూడా చెప్పినా ఆమె వినలేదని రెండుమూడు మాసాలుగా ఈ చర్చజరుగుతున్నదని చెప్పారు. అంటే షర్మిల లక్ష్యం వేరుగా ఉందన్నది సజ్జల మాటల్లోనే అర్థం చేసుకోవచ్చు. ఆమెను టిఆర్ఎస్ తీసుకుని వచ్చిందని కాంగ్రెస్ నేతలు...బిజెపి నేతలు కూడా అంటున్నారు. ఆమెను ఎవరు దింపినా మరోమారు మోసపోవడానికి సిద్దంగా లేమని తెలంగాణ ప్రజలు నిరూపించాలి. తెలంగాణ ప్రజలు ఈ పరిణామాలను ఎలా స్వీకరిస్తారన్నది ముమ్ముందు తేలనుంది.

## మూడున్నర లక్షల కోట్లు ఖర్చు చేసినా రోడ్లు బాగుపడలేదు

**ధాన్యం కొనబోమన్న మంత్రి వ్యాఖ్యలపై మండిపాటు**
**నాల్గోరోజు కొనసాగిన రేవంత్ పాదయాత్ర**

నాగర్‌కర్నూలు,ఫిబ్రవరి11(ఆర్‌ఎన్‌ఎ): గద్దెనెక్కిన తర్వాత సీఎం కేసీఆర్ పదమూడున్నర లక్షల కోట్లు ఖర్చు చేసినా..గ్రామాల్లో సరిగా రోడ్లు లేవని కాంగ్రెస్ ఎంపీ రేవంత్ రెడ్డి అన్నారు. నాల్గోరోజు పాదయాత్రలో మాట్లాడిన రేవంత్.. కొండారెడ్డి పల్లి నుండి తిమ్మరాసిపల్లి మీదుగా కల్వకుర్తికి టూవీలర్ పై వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. అవసరమైతే దేవుడితో కొట్లాడుతా అన్న కేసీఆర్.. మోడీ తెస్తున్న చట్టాలపై ఎందుకు మాట్లాడట్లేదన్నారు. 'వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి పంట కొనబోమంటున్నారు..నీ అయ్యా జాగీరా పంట ఎందుకు కొనరని ప్రశ్నించారు' రేవంత్. రాజశేఖర్ రెడ్డి బాటలోనే రేవంత్ రెడ్డి పాదయాత్ర మొదలుపెట్టారన్నారు మాజీ ఎమ్మెల్యే వంశీచందర్ రెడ్డి. కల్వకుర్తి రైతుల బాధలు చెబుతున్నారన్నారు. తిమ్మరాసి పల్లిలో పూర్తిగా రైతులే ఉన్నారని.. రైతు సమస్యలు పోయే వరకు రైతు పోరాటాలు కొనసాగుతాయన్నారు. రైతు భరోసా యాత్రలో భాగంగా నాలుగోరోజు నాగర్ కర్నూల్ జిల్లాలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీ రేవంత్ రెడ్డి పాదయాత్ర కొనసాగుతోంది. అయితే నాలుగోరోజు పాదయాత్ర మొదలుకావడానికి ముందు ఆయనను ములుగు ఎమ్మెల్యే సీతక్క కలిశారు. ఆయనకు సీతక్క పెయిన్ రిలీఫ్ ఇచ్చే కొత్త చెప్పులను గిఫ్ట్‌గా ఇచ్చారు. వాటిని వేసుకొని చూసిన రేవంత్ రెడ్డి.. చెప్పులు బాగున్నాయన్నారు. కేంద్రం తెచ్చిన అగ్రిచట్టాలకు వ్యతిరేకంగా ఎంపీ రేవంత్ రెడ్డి ఈ రాజీవ్ రైతు భరోసా పాదయాత్రను మొదలుపెట్టారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు చీల్చే కుట్ర జరుగుతోందని ఆమె మండిపడ్డారు.

## జన్మదినోత్సవాన మొక్కలు నాటిన పోచారం

**-ప్రతి ఒక్కరూ కోటి వృక్షార్చనలో పాల్గొనాలని పిలుపు**

హైదరాబాద్,ఫిబ్రవరి11(ఆర్‌ఎన్‌ఎ): రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌కు అనూహ్య మద్దతు లభిస్తున్నది. అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన జన్మదినం సందర్భంగా మినిస్టర్ క్వార్టర్స్ లోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తన వంతుగా మొక్కలు నాటడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. 17 వ తేదీన సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా 'కోటి వృక్షార్చన' ఒకే రోజు - ఒకే గంటలో- ఒక కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి మొబైల్ నెంబర్‌కు పంపించాలని కోరారు. మొబైల్ యాప్ కోసం మీ వాట్సప్ నుంచి 9000365000 నెంబర్‌కు మెసేజ్ చేయాలని పిలుపునిచ్చారు. హరిత సంకల్పంలో మీ కృషికి గుర్తింపుగా ముఖ్యమంత్రి దగ్గర నుంచి వనమాలి బిరుదును మీకు ఈ మెయిల్, మొబైల్‌కు వారం రోజుల్లో పంపిస్తారని స్పీకర్ పోచారం తెలిపారు.

## పోడు భూముల జోలికి వస్తే ఖబర్దార్

**-అటవీ అధికారులకు ఎమ్మెల్యే శంకర్ నాయక్ వార్నింగ్**

మహబూబాబాద్,ఫిబ్రవరి11(ఆర్‌ఎన్‌ఎ): పోడు భూములలో కందకం తీస్తే ఖబర్దార్ అని ఎమ్మెల్యే శంకర్ నాయక్ మరోసారి అటవీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని గూడూరు మండలంలోని భూపతిపేటలో ఎమ్మెల్యే శంకర్ నాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా తాము సాగు చేసుకుంటున్న పోడు భూములలో అటవీశాఖ అధికారులు కందకాలు తీస్తున్నారనే విషయాన్ని శంకర్ నాయక్ దృష్టికి గ్రామస్తులు తీసుకువచ్చారు. దీంతో అటవీ అధికారులపై ఎమ్మెల్యే తీవ్రంగా మండిపడ్డారు. పోడు భూములలో కందకం తీస్తే ఖబర్దార్ అని అధికారులను హెచ్చరించారు. స్టేటస్ కో పాటించాలని ప్రభుత్వం ఆదేశించాక కూడా కందకాల పేరుతో అటవీ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. రైతుల కోపం ఎలాగుంటుందో చూడాలనుకుంటే కందకాలు తీయాలని అటవీ అధికారులకు సవాల్ విసిరారు. రైతులను రెచ్చగొడితే అటవీ అధికారులకు తగిన గుణపాఠం చెబుతామని ఎమ్మెల్యే శంకర్ నాయక్ పేర్కొన్నారు.

## గతానుభవాలతో అధికారుల అప్రమత్తం

**కందుల కొనుగోళ్లలో పారదర్శకతకు పెద్దపీట**
**రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు**

ఆదిలాబాద్,ఫిబ్రవరి11(ఆర్‌ఎన్‌ఎ): కంది పంట కొనుగోళ్లలో గతంలో అక్రమాలు వెలుగుచూశాయి. మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు తీసుకొచ్చి అక్రమంగా నిల్వచేసిన పంటను అధికారులు పట్టుకున్నారు. కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై అప్పట్లో కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. ఆ సారి పంట కొనుగోళ్లలో అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. అధికారులు ప్రస్తుతం అమలు చేస్తున్న ఈ విధానంతో దళారుల దందాకు అడ్డుకట్ట పడింది. వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పంట సాగుచేసిన రైతుల వివరాలను సేకరించారు.ఏ రైతు ఎన్ని ఎకరాల్లో పంటను సాగు చేశాడు? పంట దిగుబడి ఎంత వచ్చిందనే వివరాలు తీసుకున్నారు. మార్కెట్‌యార్డులకు రైతుల పంటను విక్రయానికి తీసుకొచ్చినప్పుడు తమ వద్ద ఉన్న వివరాలను వారి పరిశీలించి నిర్ధారణ చేసుకున్న తర్వాత కొనుగోలు చేస్తున్నారు. గతంలో దళారులు మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి కందులను తక్కువ ధరకు తీసుకొచ్చి రైతుల పేరిట ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే వారు. దీంతో రైతులు నష్టపోవాల్సి వచ్చేది. ఆదిలాబాద్ మార్కెట్‌యార్డుతో పాటు వివిధ మార్కెట్‌యార్డుల ద్వారా కొనుగోళ్లు జరుగు తున్నాయి. జిల్లాలో రైతులకు పంటల విక్రయాల్లో ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది. ఎక్కువగా ఎక్కువగా పత్తి, కంది, సోయాబీన్ పంటలను సాగవుతుండగా.. రైతులు నష్టపోకుండా వారికి కనీస మద్దతు ధర లభించేలా ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా సర్కారు పంటలను కొనుగోలు చేస్తున్నది. ప్రాథమిక వ్యవసాయ సంఘాల ద్వారా పంట సేకరణ జరుగుతోంది. ఆయా మార్కెట్‌యార్డు పరిధిలోని మండలాల్లోని గ్రామాల రైతులకు ఏ రోజున మార్కెట్‌యార్డుకు తమ పంటను తీసుకురావాలనే విషయాన్ని ముందుగా తెలియజేస్తున్నారు.

## రెండోదశ ఏకగ్రీవాలను ప్రకటించిన కమిషన్

**13 జిల్లాల్లో 539 పంచాయతీలు ఏకగ్రీవం అయినట్లు వెల్లడి**

అమరావతి,ఫిబ్రవరి11(ఆర్‌ఎన్‌ఎ): ఏపీలో తొలి దశ పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. రెండో విడత ఈ నెల 13న శనివారం జరగనున్నాయి. ఇదిలా ఉంటే రెండో దశ ఎన్నికల్లో ఎస్‌ఈసీ ఏకగ్రీవాలను ప్రకటించింది. 13 జిల్లాల్లో 539 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయని స్పష్టం చేసింది. గుంటూరు జిల్లాలో 70, ప్రకాశం జిల్లాలో 69, విజయనగరం జిల్లాలో 60, కర్నూలు జిల్లాలో 57, నెల్లూరు జిల్లాలో 35, చిత్తూరు జిల్లాలో 62, శ్రీకాకుళం జిల్లాలో

# విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించ వద్దు

**కేంద్రమంత్రి అమిత్‌షాను కోరిన పవన్ కళ్యాణ్**
**పలువురు కేంద్రమంత్రులతో భేటీ**
**జగన్ లేఖ రాయడంలో అర్థం లేదన్న జనసేనాని**
**షర్మిల పార్టీ పెట్టాక చూద్దామని వ్యాఖ్య**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి11(ఆర్‌ఎన్‌ఎ): విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించొద్దని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కోరినట్టు జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. ఢిల్లీలో కేంద్ర మంత్రులతో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. స్టీల్ ప్లాంట్‌పై తుది నిర్ణయం కేంద్రానిదేనన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ఏపీ ప్రజల మనోభావాలకు ప్రతీకగా భావించాలని కేంద్ర మంత్రులను కోరామన్నారు. స్టీల్ ప్లాంట్‌పై వైసీపీ చేయాలనుకుంటే ఏదైనా చేయవచ్చని చెప్పారు. కేంద్రమంత్రి చెప్పినట్టుగా పోస్కో, స్టీల్ ప్లాంట్ మధ్య ఒప్పందం జరిగినప్పుడు.. జగన్ లేఖ రాయడంలో ఆంతర్యమేంటని పవన్ ప్రశ్నించారు. మార్చి 3, 4 తేదీల్లో జనసేన, బీజేపీ రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకోనున్నట్టు తెలిపారు. ఏపీలో శాంతి భద్రతల పరిస్థితిని అమిత్ షాకు వివరించానని పవన్ కల్యాణ్ అన్నారు. దేవాలయాలపై దాడుల విషయాన్ని అమిత్ షా దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించవద్దని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు విజ్ఞప్తి చేశారు. జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌తో కలిసి పవన్ మంగళవారం రాత్రి హోంమంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వినతి పత్రం సమర్పించారు. ప్రజల ఆకాంక్ష మేరకు ప్లాంటు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్లాంటు కేప్టివ్ మైన్స్ కేటాయించా లని, ఆర్థిక పరిపుష్టికి కేంద్రం సహకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి ఉప ఎన్నికల్లో బీజేపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా జనసేనకు అవకాశం ఇవ్వాలని షాను కోరినట్లు సమాచారం. ఇకపోతే షర్మిల పార్టీపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తొలిసారి స్పందించారు. 'షర్మిలా ఇంకా పార్టీ స్థాపించలేదు కదా?, పార్టీ విధివిధానాలు వచ్చాక మాట్లాడదాం. ప్రతీ ఒక్కరూ పార్టీ పెట్టుకోవచ్చు. తెలంగాణలో షర్మిల పార్టీ రావాలనే కోరుకుంటున్నా. కేసీఆర్ పాలన గురించి హైదరాబాద్‌లోనే మాట్లాడతా'అని పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు.

# స్పైస్ బోర్డుతో మారని పరిస్థితి

**మద్దతు ధరలు దక్కక పసుపు రైతుల్లో ఆందోళన**
**మహారాష్ట్ర ఎఫెక్ట్‌తో అనూహ్యంగా పెరుగుతున్న ధరలు**

నిజామాబాద్,ఫిబ్రవరి11(ఆర్‌ఎన్‌ఎ): కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పైస్ బోర్డుతో పసుపు పంటకు లాభాలు చేకూరే అవకాశాలు లేవని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో పంట అమ్మకాలపై గతంలో ఎన్నడూ లేనంతగా సందిగ్దత నెలకొం టోంది. స్పైసెస్ బోర్డుకు ధర నిర్ణయాక అధికారం ఉంటుందా అనే అంశంపై రైతుల్లో ఆందోళన నెలకొంది. ఒకవేళ స్పైస్ బోర్డు ధర విషయంలో స్వయం నిర్ణయాధికారం కలిగి ఉంటే అది రైతులకు ఎంతో తోడ్పడనుందని అంటున్నారు. స్పైస్ బోర్డు పరిధిలో పసుపుతోపాటు మిర్చి తదితర సుగంధ ద్రవ్యాల పంటలకు మేలు జరగనుందంటూ కేంద్ర సర్కారు ప్రకటించింది. అయితే సరైన మార్కెటింగ్ సౌకర్యంతో పాటు గిట్టుబాటు కల్పనపై స్పైస్ బోర్డుకు అధికారం లేదని అంటున్నారు. దీంతో అది ఏర్పాటైనప్పటికీ ఎలాంటి ప్రయోజనం ఉండబోదని అంటున్నారు. పసుపు రైతుల ఆకాంక్ష మేరకు పసుపుకు గిట్టుబాటు ధరలు దక్కేలా చేస్తేనే దీని ప్రయోజనం నెరవేరగలుగుతుంది. స్పైస్ బోర్డు ఏర్పాటు నిర్ణయం వెలువడినప్పటికీ దానికి సంబంధించిన విధి విధానాలు, స్పష్టమైన మార్గదర్శకాలు, అది నిర్వర్తించే బాధ్యతల విషయంలో స్పష్టత రాలేదు. కేంద్ర ప్రభుత్వం మార్గ దర్శకాలు విడుదల చేసిననప్పుడే ఈ బోర్డుపై స్పష్టత వస్తుంది. నిజానికి పసుపు సాగుకు చాలా ఖర్చు అవు తోంది. మద్దతు ధర గిట్టుబాటు కావడం లేదు. ఎకరం పసుపును తీసేందుకు కూలీలకే రూ.25వేలు ఖర్చువుతోంది. అది ఉడకబెట్టేందుకు డ్రమ్ముకు రూ.150 తీసుకుంటున్నారు. పసుపు అమ్మితే క్వింటాకు రూ. 4 వేలు మద్దతు ధర చెల్లిస్తున్నారు. ఇది ఎటూసరిపోదు. కనీసం రూ. 10వేలు ఇస్తేనే గిట్టుబాటు అవుతుందని రైతులు అంటున్నారు. రెండు మూడేళ్లుగా గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్నారు. గిట్టుబాటు ధర కల్పించి న్యాయం చేయాల్సిన బాధ్యత ఇప్పుడు స్పైసెస్ బోర్డుపై ఉంది. అయితే అనూహ్యంగా గత వారం రోజులుగా పసుపు ధర రోజురోజుకూ కొంత పెరుగుతున్నది. ఇటీవల క్వింటాలు రూ.7,658లు పలికింది. ఈ సీజన్‌లో అత్యధికంగా ఇదే ధరగా నిలిచింది. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు గడిచిన నెలన్నర రోజులుగా కొత్త పసుపు వస్తోంది. గత నెలలో క్వింటాలు పసుపు ధర రూ.4,500ల నుంచి రూ.6,500ల మధ్య పలకగా.. ప్రస్తుతం పెరిగింది. జిల్లా పసుపు రైతులతో పాటు నిర్మల్, జగిత్యాల రైతులు ఈ పసుపును తీసుకు వచ్చారు. పక్కనే ఉన్న మహారాష్ట్రలో పసుపు ధర పెరగడం.. సాంగ్లీ మార్కెట్‌లో క్వింటాలుకు రూ. 8వేలకు పైగా ధర వస్తుండడంతో జిల్లా మార్కెట్‌లో కూడా రేటు పెరిగింది. కేంద్ర ప్రభుత్వం ఎగుమతులకు కూడా అవకాశం ఇవ్వడంతో ధర కొద్ది కొద్దిగా పెరుగుతున్నట్లు వ్యాపారులు తెలిపా రు. పసుపు మార్కెట్‌లో కనిష్ఠ ధర క్వింటా లు రూ.4, 500లు ఉండగా, గరిష్ఠ ధర రూ.7 650లు వచ్చింది. బల్బు రకానికి కూడా క్వింటాలు రూ.6,979లు పలికింది. సీజన్ మొదలుకావడంతో ఎక్కువమంది రైతులు పసుపును తీసుకువస్తున్నారు. మార్కెట్‌కు వచ్చే పసుపునకు తగిన ధర వచ్చే విధంగా చూస్తున్నామని కార్యదర్శి అపర్ణ తెలిపారు. రైతులకు ధర వచ్చే విధంగా చూస్తున్నామన్నారు. ధర పెరగడంతో మార్కెట్‌కు మరింత ఎక్కువ పసుపు వచ్చే అవకాశం ఉండడంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# మోడీ చొరవతో ప్రపంచ దేశాలతో పెరిగిన భారత్ బంధం

**పటిష్ట విదేశాంగ విధానంలో ముందున్న భారత్**
**గతంకన్నా మరింత ధృడంగా సంబంధాలు**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి11(ఆర్‌ఎన్‌ఎ): కరోనాతో పాటు, వ్యాక్సిన్ అభివృద్ధిలో భారత్ ఘనత కారణంగా విదేశాంగ విధానంలో మోదీ హయాంలో ప్రపంచ దేశాల్లో భారత్‌కు లభించినంత గుర్తింపు మరే ప్రధానమంత్రి హయాంలో లభించలేదన్న విషయం ఎవరైనా గుర్తించాల్సిందే. గత ఆరేళ్లలో మోదీ ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలలోనూ పర్యటించి భారత్‌కు అంతర్జాతీయంగా అనితరసాధ్యమైన గుర్తింపు తీసుకుని వచ్చారు. ఏదేశమేగినా మోడీ గురంచి చర్చించుకునేలా చేశారు. విదేశాంగ విధానంలో మోడీ కొత్త ఒరవడిని సృష్టించారు. అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యాలతోపాటు చైనాతో కూడా సత్సంబంధాలు నెలకొల్పడంలో మోడీ విజయం సాధించారు. చిన్నిచిన దేశాలకు ఆపన్నహస్తం అందించడం ద్వారా భారత్ వారికి అండగా నిలుస్తుందన్న భరోసా ఇచ్చారు. భారత దేశంలో విచ్ఛిన్నకర శక్తులను ఏరివేయడం, కశ్మీర్‌లో పాక్ ఉగ్రవాదానికి కళ్లెం వేయడం వెనుక ప్రపంచ దేశాల అండదండలున్నాయని, మోదీ వివిధ దేశాధినేతలతో ఏర్పర్చుకున్న సత్సంబంధాల వల్లే ఇవాళ మనకు అంతర్జాతీయ మద్దతు లభిస్తున్నదని విదేశీ వ్యవహారాలను పరిశీలించే వారెవరికైనా అర్థమవుతుంది. పాక్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించడం, ఇస్లామిక్ దేశాలు కూడా ఆ దేశానికి మద్దతు నీయకపోవడం, అంతర్జాతీయంగా పాకిస్థాన్ ఏకాకి కావడం మొదలైన పరిణామాలు మోదీకి అంతర్జాతీయంగా ఉన్న పట్టును సూచిస్తున్నాయి. అలాగే కరోనాతో చైనాను కూడా దోషిగా నిలబెట్టే ప్రయత్నం జరిగింది. ముఖ్యంగా అమెరికా అండదండలు ఆయనకు బలంగా లభించాయని స్పష్టమవుతోంది. ప్రపంచంలో మోడీ సమర్థ నేతగా ఎదగడం వల్లనే అనేక దేశాలు ఇప్పుడు భారత్‌వైపు చూస్తున్నాయి. ప్రధానంగా ఇస్లామిక్ టెర్రరిజంపై పోరాడుతున్న దేశంగా భారత్‌తో కలసి అనేక దేశాలు ముందుకు వస్తున్నాయి. ముఖ్యంగా మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత భారత్ - అమెరికాల మధ్య సాన్నిహిత్యం మరింత పెరిగింది. అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ మధ్య స్నేహ సంబంధాలు, భారత్, అమెరికా ప్రభుత్వాధినేతల మధ్య ఎన్నడూ లేని రీతిలో దృఢంగా వున్నాయి. ఉగ్రవాదం, ఆర్థిక అసమానతలు, రక్షణ సహకారం, ఇంటెలిజెన్స్ సమాచార పంపిణీ, పర్యావరణం, సైబర్ నేరాలు, ఇంధన భద్రత, కమ్యూనికేషన్ విప్లవం, వర్తక సంబంధాలు, పెట్టుబడులు, మార్కెట్ విస్తరణ, ఉపాధి కల్పన వంటి అనేక విషయాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఒక స్పష్టమైన అవగాహనతో ఉన్నారు. జో బైడెన్ అధికార పగ్గాలు చేపట్టాక కూడా మన ఉభయ దేశాల సంబంధాలలో ఎలాంటి మార్పు లేదు. తమ బంధాన్ని కొనసాగించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. భారత్, అమెరికాలు ప్రపంచంలో రెండు అతి పెద్ద ప్రజాస్వామిక దేశాలు మాత్రమే కాదు, అగ్రగామి ఆర్థిక వ్యవస్థలు కూడా. ఆర్థిక సత్తాలో ప్రథమ స్థానంలో ఉన్న అమెరికా, ఐదవ స్థానంలో ఉన్న భారత్ మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడడం ప్రపంచానికి అత్యంత ప్రయోజనకరంగా మారనుంది. అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్‌ను అమెరికా వదులుకోవడానికి సిద్దంగా లేదు. అలాగే అనేకమంది మన మేధావులు ఇప్పుడు అమెనికన్ ఐటిని శాసిస్తున్నారు. గతంలో మోదీ పర్యటనతో భారతీయ అమెరికన్లలో ఒక రకమైన ఆత్మ స్థైర్యం, బలం ఏర్పడిందనడంలో సందేహం లేదు. అమెరికా జనాభాలో ఒక శాతంగా ఉన్న భారత అమెరికన్లు ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నారు. మరింత మందికి అమెరికా వెళ్లేందుకు వీసా నిబంధనలు సడలాలని సగటు భారతీయులు కోరుకుంటున్నారు. అమెరికాలో అణు ఇంధనరంగం నుంచి కమ్యూనికేషన్, ఆరోగ్య రంగాల్లో భారతీయులే కీలక పాత్ర పోషిస్తుండడం మనకు గర్వకారణం. అంతర్జాతీయంగా భారత్ శక్తి, ప్రాధాన్యత పెరిగిందనడానికి సంకేతంగా నిలుస్తుంది. రానున్న కాలంలో అంతర్జాతీయ వేదికలపై భారత్ నిర్వహించబోయే కీలక పాత్రకు కొత్త ఊపునిస్తుంది. ఉగ్రవాదాన్ని కలిసికట్టుగా నిర్మూలించడం ఎంత ముఖ్యమో, ప్రపంచ మార్కెట్‌లో చైనా దూకుడు తగ్గించడం కూడా అంతే ముఖ్యమని ఇరు దేశాలు భావిస్తున్నాయి. అమెరికా,చైనా దేశాల మధ్య పెరుగుతున్న స్పర్థలు, వాణిజ్య పోటీ భారత్‌కు ఎంతో ఉపకరిస్తుందనడంలో సందేహం లేదు. అంతేకాక అమెరికా టెక్నాలజీ సంస్థలకు భారత్‌లో లభిస్తున్న అతి పెద్ద వినియోగ మార్కెట్, బహిరంగ డేటా వరప్రదాయినిగా కనిపిస్తోంది. టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులను వినియోగించుకోకపోతే ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదని అందరికీ తెలుసు. ఈ నేపథ్యంలో ఆధునిక కాలానికి సంబంధించిన సవాళ్లను 5జీ టెక్నాలజీ ద్వారా ఎదుర్కొనేందుకు భారత్ సంసిద్ధమవుతున్నది. టెక్నాలజీ రంగంలో అమెరికాకు సాటి రాగలిగిన దేశం లేదని మనకు తెలుసు. ఇంటెలిజెన్స్ సమాచార పంపిణీ కూడా మన రక్షణ పాటవం పెరిగేందుకు దోహదం చేస్తాయనడంలో సందేహం లేదు.

## ఎపిలో తప్పని రేషన్ తిప్పలు

అమరావతి,ఫిబ్రవరి11(ఆర్‌ఎన్‌ఎ): ఏపీలో గ్రామీణ పేదలకు రేషన్ కష్టాలు తప్పడంలేదు. వారికి అందాల్సిన రేషన్ సరుకుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య దోరణి ప్రదర్శిస్తోంది. డోర్ డెలివరి వాహనాలకు వేసిన రంగులు ఎన్నికల కోడ్‌కు విరుద్ధమంటూ.. ఎస్ఈసీ వద్దన్నా వినకుండా పంతానికి పోయిన ప్రభుత్వం పేదలకు సకాలంలో సరుకులు అందకుండా దూరం చేసింది. ప్రతి నెల 1వ తేదీన మొదలయ్యే రేషన్ పంపిణీ ఈ నెల పదో తేదీ వచ్చినా గ్రామాల్లో ఇంతవరకు ప్రారంభం కాలేదు. ఎప్పుడు ఇస్తారన్నదానిపై పౌరసరఫరాల శాఖ నుంచి స్పష్టతలేదు. దీంతో రేషన్ ఎప్పుడిస్తారా అని పేదలు ఎదురుచూస్తున్నారు.

## సంత్ సేవాలాల్ మహారాజ్‌పై పోస్టల్ స్టాంపు

**-హైదరాబాద్‌లో విడుదల చేసిన మంత్రి సత్యవతి**

హైదరాబాద్,ఫిబ్రవరి11(ఆర్‌ఎన్‌ఎ): గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ స్మారకం పోస్టల్ స్టాంపు విడుదలైంది. శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 282వ జయంతి సందర్భంగా పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సీపీఎంజీ కార్యాలయంలో బుధవారం ఈ పోస్టల్ స్టాంపును రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గిరిజన జాతి ఉన్నత స్థానాలకు చేరేందుకు ఆనాడే శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఎన్నో నియమాలను, నిబంధనలను తెలియజెప్పారన్నారు. ఆయన ఆశయాలను, ఆదర్శాలను ముందుకు తీసుకువెళ్లే కార్యక్రమం నాటి నుంచి కొనసాగుతూనే ఉందన్నారు. ఈ రోజు సేవాలాల్ మహారాజ్ పోస్టల్ స్టాంపును విడుదల చేయడం గిరిజన జాతికి గొప్ప గౌరవం అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో గిరిజనుల సంక్షేమానికి, అభివృద్ధికి ఆత్మగౌరవం నిలబడే విధంగా అనేక కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతిని కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాకే తెలంగాణ రాష్ట్రంలో అధికారికంగా చేయడం ప్రారంభం అయిందన్నారు. అంతేకాకుండా బంజారా హిల్స్ నడిబొడ్డున బంజారా భవన్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వంలో జరగనన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సీఎం కేసీఆర్ నాయకత్వంలో జరుగుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర గిరిజనుల ఆత్మగౌరవం పెంపొందేలా కృషి జరుగుతుందని తాను గర్వంగా చెప్పగలనన్నారు. శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ చెప్పిన ఆదర్శాలను పాటిస్తూ గిరిజనులు మరింత ఉన్నతస్థాయికి చేరాలని మంత్రి ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి తేజావత్ రామచంద్రుడు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబల్ నాయక్, సీపీఎంజీ రాజేంద్ర కుమార్, పీఎంజీలు సాగర్ హనుమాన్ సింగ్, పి.వి.ఎస్ రెడ్డి, ఇతర పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.

## లంబాడీలు, ఆదివాసీల మధ్య చిచ్చు

**-ఎంపి సోయం బాపూరావుపై మండిపడ్డ బెల్లయ్యనాయక్**

నిర్మల్,ఫిబ్రవరి11(ఆర్‌ఎన్‌ఎ): లంబాడీలు, ఆదివాసీల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ లబ్ది పొందుతున్న ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావును వెంటనే బర్తరఫ్ చేయాలని తెలంగాణ లంబాడి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ డిమాండ్ చేశారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఉద్యమం చేయడం వెనుక ఆయన రాజకీయ లబ్ది ఉందని పేర్కొన్నారు. ఎంపీ సోయం బాపూరావు వ్యాఖ్యలపై భారతీయ జనతా పార్టీ తన వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. లంబాడి హక్కులకు భంగం కలిగిస్తున్న సోయం బాపూరావు వైఖరి మార్చుకోకుంటే ఫిబ్రవరి 15 నుంచి లంబాడి తండాలకు రానివ్వమని హెచ్చరించారు.

## విశాఖ ఉక్కుపై ఉద్యమబాట

**అఖిల పక్షాలు సైతం మద్దతు**
**సిఐటియు ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ**
**ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో నేడు వెబినార్**

విశాఖపట్టణం,ఫిబ్రవరి11(ఆర్‌ఎన్‌ఎ): విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ కార్మికులు ఉద్యమ బాట పడుతున్నారు. అ ఉక్కు ఉద్యమానికి అఖిల పక్షాలు సైతం మద్దతు తెలుపుతున్నాయి. ఇందులో భాగంగా ప్లాంట్ స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ జెఎసిలు ఏర్పడ్డాయి. సిఐటియు ఆధ్వర్యంలో ఏర్పడిన స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ..ఉక్కు సంకల్పంతో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవాలని...ఇందుకుగానూ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పిలుపునిచ్చింది. ఈ ఉద్యమానికి మద్దతుగా పలు కార్మిక సంఘాలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక (ఎఫ్‌డిఎన్‌ఎ) ఈ నెల 12న శుక్రవారం వెబినార్‌ను నిర్వహించనుంది. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, స్వంత గనుల కేటాయింపు పేరుతో నిర్వహించనున్న ఈ వెబినార్‌కు వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కెవి రమణ అధ్యక్షత వహిస్తారు. ఇంధన శాఖ మాజీ ప్రభుత్వ కార్యదర్శి ఇఎఎస్ శర్మ, మాజీ వైస్ చాన్సలర్ కెఎస్ చలం, సోంపేట, ఉద్యమకారులు వై. కృష్ణమూర్తి, ప్రముఖ సాహిత్తీ వేత గంటేడ గౌరినాయుడు, స్టీల్ ప్లాంట్ గుర్తింపు సంఘం, ప్రధాన కార్యదర్శి వైటిదాస్ తదితరులు ప్రసంగిస్తారు. ఈ వేదిక ప్రధాన కార్యదర్శి ఎ. అజశర్మ సమన్వయ కర్తగా వ్యవహరించనున్నారు. ఇకపోతే

విశాల ఉక్కు ఉద్యమంతో మోడీ ప్రభుత్వానికి పతనం తప్పదని ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలన్న కేంద్ర నిర్ణయాన్ని పూర్తిగా

వ్యతిరేకిస్తున్నట్లు వేదిక ప్రధాన కార్యదర్శి ఎ. అజశర్మ అన్నారు. రూ.4,900 కోట్లతో ప్రారంభమైన ప్లాంట్ రూ.40వేల కోట్లకుపైగా పన్నులు, డివిడెండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించింది. ప్లాంట్‌ను రక్షించ డానికి ఎంతటికైనా తెగిస్తామని హెచ్చరించారు. ఉత్తరాంధ్ర ప్రజల జీవనాడి ఈ ఉక్కు పరిశ్రమ. దీనిని అమ్మేస్తామంటే ఊరుకోబోమని,. ఉద్యమ స్ఫూర్తికి విశాఖ ప్లాంట్ నిదర్శనం కానుందన్నారు. ఉద్యమాలతో సాధించుకున్న పరిశ్రమను డబ్బుకు కక్కుర్తిపడి అమ్మేయడం అంత పనికిమాలిన పని మరొకటి లేదన్నారు. దేశ సంపదను అమ్మేస్తామంటూ బాహాటంగా బిజెపి పాలకులు చెప్పడం చూస్తే వీరు ఈ దేశం వాళ్లేనా? అనే అనుమానం కలుగుతుంది. సొంతగనుల్లేకుండా దేశంలో ఏ ప్రైవేట్ యజమాని అయినా పరిశ్రమను నడపగలడా? బిజెపి నేతలకు దమ్ముంటే ఎన్‌ఎండిసి, సెయిల్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కలపాలి. లేదంటే కార్మికులకే ప్లాంట్‌ను అప్పగిస్తే ఏడాదికి రూ.5వేల కోట్లు లాభాలు తెచ్చి చూపిస్తారని అజశర్మ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ దుస్సాహసానికి పాల్పడుతున్నారని, దీనిని కార్మికులు తిప్పికొట్టడం ఖాయం అన్నారు. 2000 సంవత్సరంలోనే స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని కేంద్రం ప్రయత్నిం చిందని అయితే ఆనాడే కార్మికులు తిప్పికొట్టారని గుర్తు చేశారు. గతంలో షిప్‌యార్డును ప్రైవేటీకరించినప్పుడు కార్మికులు పోరాడి నిలబెట్టుకున్నారు. తెన్నేటి స్టీల్‌ఎ÷-లాంట్ సాధనకు ఉద్యమం లేవనెత్తారు.

బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా గిరిజనులు విశాఖ ఏజెన్సీలో సాగించిన ప్రజా ఉద్యమం స్ఫూర్తితో స్టీల్‌ప్లాంట్ కార్మికులు పోరాడి విజయం సాధించాలి. ఉక్కు కార్మికులు అత్యంత చైతన్యం కలిగిన వారు. మోడీ చేసిన నిర్ణయాన్ని తిప్పి కొట్టే ఉద్యమంలో జిల్లా నలుమూలలా ప్రజలను కదిలించి ఉద్యమానికి సహకారం అందిస్తాం. విశాఖ ఉక్కు ప్రాణాల బలిదానంతో వచింది. దీనిపై యువత ఆధారపడి ఉంది. వారి భవిష్యత్ పాలకులకు పట్టదా? నిర్వాసితులు తమ భూములిచ్చి ఉద్యోగాల కోసం వేల సంఖ్యలో నేటికీ ఎదురు చూస్తున్నారు. దీనిని ప్రైవేటీకరిస్తే వారి భవిష్యత్ ప్రశ్నార్థకం కానుందన్నారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు 2001లో ఆయన్ను కలిసి స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి నిధులు అడిగితే ఒక్కపైసా ఇవ్వలేదని సిఐటియు నేత నర్సింగరావు అన్నారు. ఇప్పుడు మోడీ ప్రభుత్వం దీనిని అమ్మకానికి పెట్టింది. జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్లాంట్‌కు చెందిన 20వేల ఎకరాలకు పైగా భూములను రూ.3వేల కోట్లకు రియల్ ఎస్టేట్‌కు అమ్మేసే కుట్ర స్ట్రాటజిక్ సేల్ విధానంలో ఉంది. మోడీ ప్రభుత్వం తక్షణమే తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సునిశిత పరిశీలన ద్వారా పెండింగ్ కేసుల పరిష్కారం

## -కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్, ఫిబ్రవరి 11: (నేటినిజం ప్రతినిధి): పెండింగ్ కేసుల్లోని దర్యాప్తుల్లో నాణ్యతప్రమాణాలను సునిశితంగా పరిశీలించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి కమిషనరేట్‌లోని పోలీసు అధికారులను ఆదేశించారు. పెండింగ్ కేసుల దర్యాప్తుల్లో నాణ్యతప్రమాణాలను సునిశితంగా పరిశీలించడం ద్వారా ఆయా కేసుల పరిష్కారానికి మార్గాలు లభిస్తాయని చెప్పారు.

పెండింగ్‌కేసులకు సమీక్షల ద్వారానే పరిష్కారం లభిస్తుందనే విషయాన్ని ప్రతి అధికారి గుర్తించాలని చెప్పారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో కరీంనగర్ కమిషనరేట్ 2017 నుండి ఇప్పటి వరకు గతనాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలో మొదటిస్థానంలో కొనసాగుతోందని, ఇదే స్థానాన్ని పదిలంగా కొనసాగించి ఇతరులకు ఆదర్శంగా నిలిచేందుకు ప్రస్తుతం కొనసాగిస్తున్న పద్ధతులను పాటిస్తూ ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. దీర్ఘకాలం నుండి పెండింగ్‌లో ఉన్న వారెంట్లు, సమన్లను వేగవంతంగా అమలుచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ రకాల నేరాలకు పాల్పడి ఇతరప్రాంతాల్లో ఉంటున్న వారిని గుర్తించేందుకు శ్రద్ధాసక్తులతో ముందుకుసాగితే సదరు నేరాల్లో నిందితులు పట్టుబడి కేసుల సంఖ్య తగ్గుతుందని పేర్కొన్నారు. సదరు నేరాల్లో నిందితులు శిక్షింపబడటం ద్వారా పోలీస్‌శాఖ ప్రతిష్ఠ పెంపొందుతుందని తెలిపారు. పోలీస్‌శాఖ ప్రతిష్ఠను పెంపొందించేందుకు లభించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### నేరాల ఛేదనపై దృష్టికేంద్రీకరించాలి

నేరాల ఛేదనపై అన్నిస్థాయిలకు చెందిన పోలీసు అధికారులు దృష్టికేంద్రీకరించాలన్నారు. నేరాల ఛేదనకోసం కమిషనరేట్‌వ్యాప్తంగా క్రైంబృందాలను బలోపేతం చేసేప్రక్రియ కొనసాగుతోందని, నేరాల ఛేదనపై ఆసక్తి ఉన్న వారికి అవకాశం కల్పించనున్నామని తెలిపారు. నేరాల ఛేదనకు సంబంధించి ఎలాంటి సమాచారం

ఉన్నా టెక్నాలజీని వినియోగించుకోవాలని చెప్పారు. ఎఫ్ఎస్ఎల్, ఆర్ఎఫ్ఎస్ఎల్, డిఎన్ఎ, ఇతర రకాల నివేదికలు అందక ఛార్జిషీట్లు దాఖలుచేయలేకపోతున్న వివరాలను తనదృష్టికి తీసుకవచ్చినట్లయితే పెండింగ్‌లో సదరు నివేదికలను వేగవంతంగా తెప్పించేందుకు కృషిచేస్తానని తెలిపారు. ఛార్జిషీట్లు దాఖలు చేసిన తర్వాత సంబంధిత న్యాయస్థానాల నుండి సిసి నెంబర్లను తీసుకోవాలని సూచించారు.

### అన్నిస్థాయిల పోలీసులు కోవిడ్ వాక్సిన్ వేయించుకోవాలి

కమిషనరేట్‌లోని అన్నిస్థాయిలకు చెందిన పోలీసులు కోవిడ్‌వాక్సిన్ వేయించుకోవాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి కోరారు. కోవిడ్‌వాక్సిన్ తీసుకోవడంలో ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. కోవిడ్‌వాక్సిన్‌పై వస్తున్న పుకార్లను నమ్మవద్దని సూచించారు. అన్నిరకాల ప్రయోగాలు విజయవంతం అయిన తర్వాతనే ప్రభుత్వం విడుదల చేసిందనే విషయాన్ని గుర్తించాలని చెప్పారు. కరీంనగర్ కమిషనరేట్‌వ్యాప్తంగా అన్నిస్థాయిలకు చెందిన పోలీసులకు కోవిడ్‌వాక్సిన్ ఇప్పించాలని లక్ష్యంగా పెట్టుకుని నోడల్ అధికారులను నియమించడం జరిగిందని పేర్కొన్నారు. సున్నితమైన దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు వైద్యుల సూచనల మేరకు వాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. ప్రతి కోవిడ్‌వాక్సిన్ కేంద్రంలో వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలిపారు.

# కొమురవెల్లికి పెరుగుతున్న భక్తుల సంఖ్య

సిద్దిపేట,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శివరాత్రి వరకు భక్తుల రాక పెరగనుంది. గత కొన్ని రోజులుగా వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాకతో క్షేత్రం జనసందడిగా మారింది. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రానున్న రోజుల్లో మరింతగా భక్తుల రాక పెరగగలదని తెలుస్తోంది. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు కొమురవెల్లికి తరలివచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. స్వామి వారి సన్నిధికి భక్తులు ఉదయం నుంచే చేరుకున్నారు. అనంతరం ఆలయ నిర్వహణలో ఉన్న గదులతోపాటు ప్రైవేటు గదులను అద్దెకు తీసుకుని బస చేశారు. ఆదివారం వేకువజామునే కోనేటిలో పవిత్రస్నానం ఆచరించి, నేరుగా స్వామి వారి దర్శనం కోసం క్యూలో గంటల తరబడి వేచి ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు. కొంతమంది భక్తులు అర్చనలు, ప్రత్యేక పూజలు, కేశఖండన, నజరు, మహామండప, చిలుక పట్నం, బోనం, టెంకాయలు, హుండీల్లో కానుకలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు తమ కోర్కెలు తీర్చాలని గంగరేగు చెట్టు వద్ద ముడుపులు, సంతానం కలగాలని మరికొందరు ఒల్లు బండ పూజలు, రాతిగీరల వద్ద మొక్కులు, కోడెను కట్టివేసి స్వామి వారిని వేడుకున్నారు. భక్తులకు మల్లన్న ఆలయ పాలక మండలి,ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు సేవలు అందించారు.

# మేయర్ ఎన్నికల బరిలో బిజెపి

## -అనూహ్యంగా టీఆర్ఎస్‌కు ఎంఐఎం మద్దతు

హైదరాబాద్,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ: జీహెచ్ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియలో బీజేపీ బరిలో నిలిచింది. సరైన బలం లేకపోయినప్పటికీ మేయర్ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులను నిలిపింది. మేయర్ అభ్యర్థిగా ఆర్కేపురం కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్‌గా రాంనగర్ కార్పొరేటర్ రవిచారిని ప్రకటించింది. అయితే రవిచారి సమావేశానికి ఆలస్యంగా రావడంతో.. ఆయన స్థానంలో బేగంబజార్ కార్పొరేటర్ శంకర్ యాదవ్ పేరును ప్రకటించింది. దీంతో బీజేపీ కార్పొరేటర్లలో గందరగోళం నెలకొన్నది. కాగా, మేయర్ ఎన్నికకు కాంగ్రెస్ పార్టీ, ఎంఐఎం దూరంగా ఉంటున్నట్లు ప్రకటించాయి. బిజెపి రంగంలోకి

దిగడంతో అనూహ్యంగా ఎంఐఎం తమ మద్దతును టిఆర్ఎస్‌కు ప్రకటించింది. అభ్యర్థులకు మద్దతుగా చేతులు ఎత్తింది. ఇక పార్టీల వారీగా బలబలాలను పరిశీలిస్తే.. 150 డివిజన్లలో 56 స్థానాలను గెలిచి అతిపెద్ద పార్టీగా టీఆర్ఎస్ అవతరించింది. బీజేపీకి 48, ఎంఐఎంకు 44, కాం గ్రెస్ రెండు డివిజన్లకు గెలుచుకున్నది. లింగోజిగూడ కార్పొరేటర్ రమేశ్ కరోనాతో మరణించారు. దీంతో 149 సభ్యులకు కౌన్సిల్ పరిమితమైంది. ఈ క్రమంలోనే మేజిక్ ఫిగర్ 97కి చేరింది. ఎన్నికలో ఎక్స్ అఫీషియో సభ్యుల మద్దతు కీలకంగా మారింది. టీఆర్ఎస్‌కు 32 ఎక్స్ అఫీషియో కలిసి 87 మంది బలం ఉంది. బీజేపీకి 47 మంది కార్పొరేటర్లు, ఇద్ద రు ఎక్స్ అఫీషియోలతో కలిసి 49గా ఉంది. ఎంఐఎంకు 44 మంది కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో 10తో కలిపి 54 మంది బలం ఉంది. కాంగ్రెస్‌కు ఇద్దరు మాత్రమే కార్పొరేటర్లు ఉన్నా రు. బీజేపీ, ఎంఐఎం పార్టీల వ్యూహం ఎలా ఉన్నా గెలుపు మాత్రం టీఆర్ఎస్‌కు నల్లేరు మీద నడకలాంటిదేనని చెబుతున్నారు.

# హామీలను విస్మరిస్తున్న అధికార పార్టీ

వరంగల్,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): ద్వంద్వ ప్రకటనలతో నిరుద్యోగులను అయోమయంలోకి నెడుతున్నారని ఎమ్మెల్యే సీతక్క ఆరోపించారు. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో అధికారంలోకి వచ్చిన తెరాస వాగ్దానాన్ని మరిచిపోయిందన్నారు.సింగరేణి డిపెండెంట్ ఉద్యోగాలు ఇస్తానని చెప్పి ఆ తర్వాత రెండేళ్లకు పైగా సర్వీసు ఉన్నవారికే అర్హత అని ప్రకటించి ఎంతో మందికి నిరాశ మిగిల్చారన్నారు. ఉద్యోగాలకు ప్రకటనలు ఇవ్వటం, ఆ తర్వాత ఏదో ఒక కోర్రీతో భర్తీని వాయిదా వేయడం ప్రభుత్వానికి అలవాటుగా మారిందని విమర్శించారు. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన తెరాస పాలనా కాలంలో కొన్ని వేలనే భర్తీ చేసిందన్నారు. ఒప్పంద ఉద్యోగులను ఇప్పటికీ క్రమబద్ధీకరించలేదన్నారు. తాజాగా గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగాలకు మార్కుల శాతం నిబంధనలు పెట్టి నిరుద్యోగులకు ఆందోళనకు గురిచేయడం ప్రభుత్వానికే చెల్లిందని అన్నారు. నిరుద్యోగుల ఆందోళనకు భయపడే ప్రభుత్వం తప్పు సరిదిద్దు కుందన్నారు. కంది రైతులకు గిట్టు బాట ధర కల్పించడం లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు

ధర రూ.5050 ఎఫ్‌సీఐ కేంద్రంల దక్కడం లేదన్నారు. హడావిడి ప్రకటనుచేసే బదులుమార్కెట్లో నిలబడి రైతులకు దర కల్పించాలని డిమాండ్ చేశారు.

# భారతదేశ సంకల్ప శక్తిని ప్రపంచానికి చాటిన రాష్ట్రపతి ప్రసంగం

**భారత ప్రజల మధ్య ఆత్మవిశ్వాసాన్ని మరింత ఇనుమడింపచేసింది**
**చర్చలో పెద్ద సంఖ్యలో మహిళా ఎంపీలు పాల్గొన్నారు**
**కరోనా కష్టాల్లోనూ దేశం ఎదురొడ్డి నిలిచింది**
**కరోనా కట్టడిలో మనం స్ట్రాంగ్ ప్లేయర్స్‌గా నిలిచాం**
**కాంగ్రెస్ పార్టీలో వైరుధ్యాలతో పాటు అయోమయం నెలకొంది**
**వ్యవసాయ చట్టాలు తెచ్చాక కూడా మద్దతు ధరలు పెరిగాయి**
**ఏ ఒక్క మందిని కూడా మూసేసిన దాఖలాలు లేవు**
**దేశ పురుగతిలో ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేట్ రంగం కూడా ముఖ్యమే**
**లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ప్రధాని మోదీ ప్రసంగం**
**వ్యవసాయ చట్టాల ప్రస్తావన రాగానే వాకౌట్ చేసిన విపక్ష సభ్యులు**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి10(ఆర్ఎన్ఎ): పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేసిన ప్రసంగం భారతదేశ సంకల్ప శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఆయన మాటలు భారత ప్రజల మధ్య ఆత్మ విశ్వాసాన్ని మరింత ఇనుమడింపజేశాయని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవా దాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో సమాధానం ఇచ్చిన ప్రధాని మోదీ.. వివిధ అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చలో పెద్ద సంఖ్యలో మహిళా ఎంపీలు పాల్గొన్నారని, దేశంలో మహిళల ప్రగతికి ఇది ఒక గొప్ప సంకేతమని ప్రధాని మోదీ వ్యాఖ్యా నించారు. వారి అమూల్య మైన ఆలోచనలతో మహిళా ఎంపీలు సభ వ్యవహారాల ఔన్నత్యాన్ని పెంపొందించారని కొనియాడారు. మరికొద్ది నెలల్లో దేశంలో 75వ స్వాతంత్య్ర దినోత్సవం జరుపుకోబోతున్నామని, ఇది దేశంలోని ప్రతి పౌరుడికి గర్వకారణమని మోదీ పేర్కొన్నారు. మరో 25 ఏండ్ల తర్వాత భారత్ వందేండ్ల స్వాతంత్య్ర వేడుకలు జరుపుకుంటుందని, అప్పటికల్లా దేశాన్ని మరింత మెరుగైన స్థితిలో నిలబెట్టు కోవాలని ప్రధాని సూచించారు. ప్రతి పౌరుడు ప్రప ంచంలో ఏ మూలన ఉన్నా, సమాజంలో ఏ స్థాయి లో ఉన్నా దేశ ప్రగతి కోసం తన వంతు కృషి చేయాలని కోరారు. కరోనా మహమ్మారి అనంతరం ప్రపంచ దేశాల్లో స్థితిగతులు పూర్తిగా మారిపో యాయని ప్రధాని గుర్తుచేశారు. కరోనా కష్టకాల ంలో నూ దేశం ఎదురొడ్డి నిలిచిందని ప్రధాని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచ దేశాలకు భారత్ ఆశాకిరణంలా మారిందన్నారు. కరోనా మహమ్మారి కట్టడిలో మనం స్ట్రాంగ్ ప్లేయర్స్‌గా నిలిచామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా భారత్ ముందుకు సాగుతున్నదని చెప్పారు. ఇప్పుడు దేశంలో ఏ మూలకు వెళ్లినా ఓకల్ ఫర్ లోకల్ అనే నినాదం వినిపిస్తున్నదని, దేశ ప్రజలు స్థానికతకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రధాని తెలి పారు. ఇకపోతే కాంగ్రెస్ పార్టీలో వైరు ధ్యాలతో పాటు అయోమయం నెలకొందని, తమ మేలు కోసం తాము చేసుకోవడం కానీ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆలోచించడం కానీ చేయడం లేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇంతకంటే దురదృష్టం ఏముంటుందని పేర్కొన్నారు. వాదనలు అనేవి అనేక రకాలుగా ఉంటాయని, మేము అడగనప్పుడు మీరెందుకు అలా చేశారని అంటుంటారని, నిజానికి అంగీకరించడం, అంగీకరించకపోవడం అనేవి వారి వారి ఇష్టాలపై ఉంటుందని, బలవంతం ఉండదని అన్నారు. ఇందుకు ఉదాహరణలు చెబుతూ...'కట్నం తీసుకోకుండా చట్టం చేయమని ఎవరూ డిమాండ్ చేయలేదు. అయితే దేశ ప్రగతిని దృష్టిలో ఉంచుకునే చట్టం తెచ్చారు. ట్రిపుల్ తలాఖ్‌కు వ్యతిరేకంగా మేము చట్టం చేశాం. అలాగే బాల్య వివాహాల వ్యతిరేక చట్టం కూడా ప్రగతి కారక చట్టమే' అని మోదీ వివరించారు. చిన్న రైతులకు అండగా కొంత డబ్బు జమ చేయాలని ఏ రైతు సంస్థ డిమాండ్ చేయలేదని, అయితే ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద తాము రైతులకు సాయం ఇస్తున్నామని మోదీ అన్నారు. రైతు చట్టాలను ఆర్డినెన్స్ ద్వారా ఆమోదించి, ఆ తర్వాత పార్లమెంటు ఆమోదం పొందామని చెప్పారు. చట్టాల అమలు తర్వాత కూడా ఏ ఒక్క మండీ మూతపడలేదని, దేశంలో ఎక్కడా కనీస మద్దతు ధర ఆగిపో లేదని పేర్కొన్నారు. ఇది పూర్తిగా నిజం, ఇందులో దాపరికమేమీ లేదని అన్నారు. చట్టాలు చేసిన తర్వాత కూడా కొనుగోళ్లు ఎంఎస్పీ పెరిగిందని అన్నారు. సాగు బిల్లులపై అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న రైతుల పట్ల లోక్‌సభతో పాటు, తమ ప్రభుత్వానికి కూడా ఎంతో గౌరవం ఉందని అన్నారు. ఆ కారణంగానే సీనియర్ మంత్రులు నిరంతరం రైతులతో మాట్లాడుతున్నారని సభకు తెలిపారు. రైతులంటే తమకెంతో గౌరవమని మరోసారి స్పష్టం చేశారు. ఆర్డినెన్స్ చేసిన తర్వాత కానీ, పార్లమెంటులో బిల్లులు ఆమోదించిన తర్వాత కానీ ఎక్కడా కనీస మద్దతు ధరను కానీ, మండీలను కానీ ఆపిన దాఖలాలే లేవని ప్రధాని అన్నారు. ప్రభుత్వ రంగం అవసరం ఉందని, ఇదే సమయంలో ప్రైవేటు రంగం పాత్ర కూడా కీలకమని ప్రధాని మోదీ అన్నారు. టెలికాం, ఫార్మా సహా ఏ రంగం తీసుకున్నా ప్రైవేటు రంగం కీలక పాత్ర మనకు కనిపిస్తుందని పేర్కొన్నారు. మానవాళికి సేవలు అందించగ లుగుతున్నామంటే ప్రైవేటు రంగ పాత్ర కూడా కారణమని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ప్రధాని ప్రసంగిస్తూ సాగు చట్టాల ప్రస్తావన తీసుకు వచ్చినప్పుడు విపక్ష ఎంపీలు గందరగోళం సృష్టించారు. అనంతరం, సభ నుంచి విపక్ష ఎంపీలు వాకౌట్ చేశారు. అంశాల ప్రాధాన్యత దృష్ట్యా ధన్యవాద తీర్మానంపై చర్చకంటే రైతుల ఆందోళనపై తొలుత చర్చ జరపాలని విపక్షాలు మొదట్నించీ పట్టుబడుతున్నాయి.

# ఇంకెన్నాళ్లీ ప్రకృతి విధ్వంసం ?

హైదరాబాద్,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ)మానవాళి అనుసరిస్తున్న ప్రకృతి విధ్వంసకర చర్యలకు ప్రతి చర్యగా అప్పుడప్పుడూ ప్రకృతి మనకు గుర్తు చేస్తోంది. పరిమితమైన పర్యావరణ విధ్వసం ఆపలేకపోవడంతో మనమెంతగా నష్టపోతున్నామో భూకంపాలు, సునామీలు, నదులు ఉప్పొంగి ప్రవహించడం ద్వారా గుర్తు చేస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో సంభవిం చిన వరదలను కూడా మనం ప్రత్యక్షంగా చూశాం. కళ్ల ముందుకు విపత్తులు కానవస్తున్నా మనలో మార్పు రావడం లేదనడానికి తాజా ఉదాహరణ ఉత్తరాఖండ్ ఘటనలుగా చూడాలి. ప్రకృతి విధ్వంసం, అడవుల నరికివేత, కొండలు,గుట్టల విధ్వంసం, ఇసుక తోడివేత వంటి చర్యలను ఆపకపోవడం వల్ల జరుగుతున్న నష్టాలపై పర్యావరణవేత్తలు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నా మనం పట్టించుకోవడం లేదు. భూగోళం వేడెక్కడం వలన హిమాలయాలకు ముప్పు పొంచి ఉందని పలు అధ్యయనాలు ఇప్పటికే తేల్చాయి పాతికేళ్లలో హిమాలయాల్లో మంచు కరిగే వేగం కంటే ఆ తర్వాత రెట్టింపైందని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక డిగ్రీ సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత ఇక్కడ పెరిగింది. పర్యవసానంగా మంచు కరగడం ఎక్కువైంది. ఆ నీటితో పెద్ద పెద్ద సరస్సులు ఏర్పడుతున్నాయి. నీటి ప్రవాహం పెరిగినప్పుడు నదులుగా మారుతున్నాయి. మంచు కరగడం వలన కొండచరియలు విరిగిపడుతున్నాయి.

దీనికితోడు ఇష్టం వచ్చినట్లుగా కొండ ప్రాంతాల్లో విధ్వంసం జరుగుతోంది. విద్యుత్ ప్రాజెక్టులు, సొరంగాలతో ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నాం. హిమాలయ సానువుల్లో గల ఉత్తరాఖండ్‌లో గత ఆదివారం అకస్మాత్తుగా సంభవించిన జలవిలయానికి 18 మంది మృత్యువాతపడగా రెండొందలకుపైన గల్లంతయ్యారు. ఒక్కపెట్టున విరుచుకుపడ్డ వరదలకు ఆనకట్టలు, వంతెనలు, రోడ్లు, ఇళ్లు, కట్టడాలు కొట్టుకుపోవడమో తీవ్రంగా దెబ్బతినడమో జరిగింది. జలవిద్యుత్ కేంద్రాలు సైతం నామరూపాల్లేకుండా పోయాయంటే బీభత్సస్థాయి ఏమేరకు ఉందో ఊహించుకోవచ్చు. చమోలీ జిల్లా జోషీమఠ్ సమీపంలోని నందాదేవి హిమానీ నదం నుంచి భారీ మంచు చరియలు ధౌలీగంగ నదిలో పడటంతో ఒక్కసారిగా వరద పోటెత్తి రుషిగంగ, అలకనంద నదులను ముంచెత్తడం జలప్రళయానికి కారణంగా చెబుతున్నారు. హఠాత్పరిణామానికి ఎన్‌టిపిసి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న భారీ జల విద్యుత్ కేంద్రం 'తపోవన్'లో పని చేస్తున్న 170 మంది కార్మికులు ప్రవాహంలో చిక్కుకుపోయారు. వంతెనలు, రహదారులు కొట్టుకుపోవడంతో పలు గ్రామాల ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగింది. పర్యావరణ సమతౌల్యం దెబ్బ తింటే ఎటువంటి విపత్తులొస్తాయో ప్రస్తుత ఉత్తరాఖండ్ అనుభవం మరోసారి మన కళ్ల ముందుంచింది. రెండు దశాబ్దాల్లో ఉత్తరాఖండ్ పెద్ద ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంది. 2013లో 'చార్‌ధామ్' యాత్ర మార్గాల్లో వరద బీభత్సం దేశానికే కాదు ప్రపంచానికే పాఠాలు నేర్పింది. అప్పుడు ఏకంగా 5,700 మంది మరణించారు. ఇష్టారీతిన నదులపై నెలకొల్పిన ప్రైవేటు విద్యుత్ ప్రాజెక్టులు నదీ ప్రవాహానికి అడ్డుగా మారడంతో నష్టం తీవ్రత ఎక్కువైంది. దేశంలో 2004లో సునామీ తర్వాత అతి పెద్ద ప్రళయం అదే. అంతకుముందు అదే రాష్ట్రంలో ఉత్తరకాశీ, చమోలీలో భారీ భూకంపాలు, మల్పాలో మంచు చరియలు పడ్డ ఘటనల్లో వందల్లో ప్రాణనష్టం సంభవిం చింది. 2013 విపత్తు అనంతరం కూడా హిమాలయాల్లో వాతావరణ మార్పులపై ఎప్పటికప్పుడు అన్వేషించి ప్రజలను, ప్రభుత్వాలను అప్రమత్తం చేసే వ్యవస్థను నెలకొల్పుకోలేక పోయాం. పర్యావరణ హాని కారకాలను ప్రపంచంపై వదులుతున్న కారణంగా సంభవించిన ముప్పుగా గుర్తించాలి. పైగా ఇక్కడి సహజ వనరుల విచ్చలవిడి దోపిడీ ద్వారా పర్యావరణానికి హాని తలపెడుతున్నాయి. ఇకపోతే ఉత్తరాఖండ్ విషాదాన్ని మరో హిమాలయన్ సునామీగా శాస్త్రవేత్తలు అభివర్ణిస్తున్నారు. ఎనిమిదేళ్ళ నాటి విధ్వంసంతో పోల్చినప్పుడు తక్కువస్థాయిలో ఉన్నా అది డేంజర్ బెల్ మోగించిందని గుర్తించాలి. ప్రాణాలు కోల్పోయిన వారు, కనిపించకుండాపోయినవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. వర్షకాలమైతే కుంభవృష్టితో వరదలు రావడమో, మండువేసవైతే హిమఖండాలు కరిగి ఊళ్లను ముంచెత్తడమో జరుగుతూంటుంది. కానీ, ఆదివారం జరిగిన దుర్ఘటన చలికాలంలో జరిగింది. వర్షంకంటే మంచుఫలకాలు వాటికవి కరిగి జారడమే ఈ దుర్ఘటనకు కారణమన్న వాదనే బలంగా వినిపిస్తున్నది. ఒకప్పుడు మంచుఫలకాలు మైనస్ ఆరునుంచి ఇరవైడిగ్రీల ఉష్ణోగ్రత మధ్య ఉండేవనీ, ఇప్పుడవి మైనస్ రెండు నుంచి పదిడిగ్రీల మధ్య ఉంటున్నాయని పర్యావరణవేత్తలు అంటున్నారు. భూతాపం ప్రభావంతో తీవ్రమైన చల్లదనాన్ని క్రమంగా కోల్పోతున్న మంచుకొండలు సులువుగా కరుగుతున్నాయి, ఏ చిన్నకారణం దొరికినా పట్టుజారుతున్నాయి. హిమఖండాలు నెమ్మదిగా కరుగుతూ, హిమనీనదాల్లోకి క్రమంగా నీరుచేరడం ప్రకృతి సహజసిద్ధమైన ప్రక్రియ. వాతావరణమార్పులే దీనికి కారణమని విశ్లేషిస్తున్నారు. గంగ, దాని ఉపనదులమీద వరుసగా కడుతూ పోతున్న జలవిద్యుత్ ప్రాజెక్టులు అక్కడి పర్యావరణ వ్యవస్థని నాశనం చేస్తున్నాయి. ఇప్పటికే ఎన్ని ప్రాజెక్టులున్నా, మరిన్ని అనుమతించాల్సిందిగా అక్కడి ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతూనే ఉంటుంది. అవసరం ఉన్నా లేకున్నా భారీ ప్రాజెక్టులు తయారవుతూనే ఉన్నాయి. ఉత్తరాఖండ్ ఉదంతం ప్రకృతితో మనం అమానుషంగా వ్యవహరిస్తున్న విషయాన్ని మరోమారు గుర్తుచేసింది. మానవుడు అభివృద్ధి పేరిట సాగిస్తున్న విధ్వంసానికి ప్రకృతి ప్రతీకారం తీర్చుకుంటుందనడానికి ఇది నిదర్శనంగా చూడాలి. ప్రకృతి విధ్వంసక చర్యలను ఆపకపోతే అంతకుమించిన ఉపద్రవం ముందు ఎదుర్కోక తప్పదు. అప్పుడు విచారించి లాభం లేదు. పోతేపోనీ అనుకుంటే మానవాళి మనుగడకే ప్రమాదం పొంచి ఉంటుంది.

# గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలి

## యువ సర్పంచ్‌లదే కీలక భూమిక: ఎమ్మెల్యే

ఆదిలాబాద్,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సర్పంచులు పని చేయాలని, గతంలో ఎప్పుడూ లేనంతగా గ్రామాల అభివృద్ధికి సిఎం కెసిఆర్ నిధులు విడుదల చేస్తున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. వీరిని కులుపుకుని ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకుని వెళతామని అన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోని గ్రామపంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 24 గంటలు విద్యుత్ సరఫరా కోసం ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తున్నామనీ, రాబోయే రో జులలో మనవే అమ్మే రోజులు వస్తాయన్నారు. అన్ని గ్రామాలలో ఉన్న చెరువులను గోదావరి జలాలతో నింపడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సూచించిన ప్రకారం వార్డు సభ్యులు, గ్రామస్తుల సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. హరిత హారంలో భాగంగా మొక్కలను నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. బాధ్యతగా సేవ చేసినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. యువ సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధికి నడుం బిగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు రూపాయి ఖర్చులేకుండా అందిస్తున్నామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మి, డబుల్ బెడ్రూం ఇండ్లు పేదలకు ఉపయోగపడే ఎలాంటి సంక్షేమ పథకాల్లోనైనా ఎవరైనా డబ్బులు అడిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇకపై సంక్షేమ పథకాలకు సంబంధించిన చెక్కులను ఇంటింటికీ తిరిగి అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

# కాంగ్రెస్ లేకుంటే తెలంగాణ ఎక్కడిది

**సిఎం కెసిఆర్ ఎక్కడుండేవాడు**
**సాగర్ సభలో చేసిన విమర్శలపై మండిపడ్డ భట్టి**
**సాగర్ ఉప ఎన్నికతో టిఆర్ఎస్ పతనం ఖాయమని వెల్లడి**

మంచిర్యాల,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పేర్కొన్నారు. హాలియా సభలో కాంగ్రెస్‌పై చేసిన విమర్శలు ఆయన అసహనానికి నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ లేకుంటే తెలంగాణ లేదని..కెసిఆర్ లేదని గుర్తుంచుకోవాలన్నారు.

పాదయాత్రలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నాగార్జున సాగర్ ఉపఎన్నికతోనే టీఆర్ఎస్ పతనం ప్రారంభమవుతోందన్నారు. సాగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ లక్షల కోట్లు దోపిడీకి పాల్పడ్డారన్నారు. లక్ష కోట్లతో ప్రారంభించిన కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల తెలంగాణలో ఒక ఎకరానికి సాగునీరు అందింది లేదన్నారు. అసలు కాళేశ్వరంలో నిర్మించింది ప్రాజెక్టు కాదన్నారు. నీళ్లను ఆపడానికి కట్టిన చెక్ డ్యామ్ అది అన్నారు. ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతిపై ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. అనేక తప్పులు చేసిన కేసీఆర్... కేసుల భయంతో ఢిల్లీకి వెళ్లి కేంద్రం ముందు మోకరిల్లాడన్నారు. టీఆర్ఎస్ పార్టీ రైతుల వైపా.. కేంద్ర ప్రభుత్వం వైపా.. అనేది కేసీఆర్ స్పష్టం చేయాలన్నారు. ఇకపోతే రైతుల సమస్యలు పరిష్కరించేందుకు అసెంబ్లీలో రైతుల తరపున తన గొంతు వినిపిస్తానని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు చట్టాలు రైతులను నట్టేట ముంచుతున్నాయని మండిపడ్డారు. నూతన చట్టాలతో రైతులకు ఒరిగిందేమీ లేదని, వ్యాపారులకు అండగా నిలిచేందుకే మోదీ ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో కొనుగోలు కేంద్రాలు ఎత్తివేస్తామని కేసీఆర్ చెప్పడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కొనుగోలు కేంద్రాలు ఎత్తివేస్తే రైతుల తరపున కాంగ్రెస్ పార్టీ నిలబడి పోరాటం చేస్తోందని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీలో చేపట్టిన రైతు దీక్షలో రైతులందరూ భాగస్వాములు కావాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రైతుల పక్షాన ఉండి రైతు సమస్యలను అసెంబ్లీతో పాటు శాసన మండలిలో వినిపించి వ్యవసాయ రంగాన్ని మెరుగు పరుస్తామన్నారు. రైతుబంధుతో సామాన్య రైతు కాకుండా భూములు వదిలేసి వెళ్లిన భూస్వాములు ఎంతగానో లాభపడుతున్నారని విమర్శించారు. ఇకనైనా కేసీఆర్ రైతులకు ఉపయోగపడే పనులు చేయాలని హితవు పలికారు.

# బిజెపి దెబ్బకు బయటకు వచ్చిన ఫామ్‌హౌజ్ ప్రభుత్వం

## -బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి

వరంగల్,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): బీజేపీకి ప్రజాదరణ పెరుగుతుండడంతో ఫామ్ హౌస్ ప్రభుత్వం బయటకు వచ్చిందని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఆరోపించారు.అయితే కెసిఆర్ బెదిరింపులకు బిజెపి భయపడదన్నారు. ప్రజా సమగస్యలపై తమ గళం మరింతగా వినిపిస్తామని అన్నారు. గురువారం నాడు గుజ్జుల మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగుల ప్రకటన, నాగార్జునసాగర్ సభ బీజేపీ ప్రభావమేనని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రంలో వైఎస్ షర్మిలతో కొత్తపార్టీ పెట్టించే వ్యూహం కూడా సీఎం కెసిఆర్‌దేనని పేర్కొన్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల స్థానం గెలిస్తే కేసీఆర్ ప్రభుత్వం పతనమైనట్టేనని జోస్యం చెప్పారు. ఎమ్మెల్సీగా పల్లా రాజేశ్వర్రెడ్డి విఫలం అయ్యారని.. దోచుకోవడమనే తప్పా పట్టభద్రులు, ఉద్యోగులకు చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు. దుబ్బాక, హైదరాబాద్ గ్రేటర్ ఎలక్షన్‌లో బీజేపీ విజయంతో ఉద్యోగాల ప్రకటన విడుదల చేశారంటూ గుజ్జుల ఆరోపణలు చేశారు.విశాఖ స్టీల్‌పై కొందరికి హక్కులు కల్పించడం వల్ల లాభాలు వస్తాయి. అంతేకాని ప్రైవేటీకరణ చేయడం లేదని గుజ్జుల అన్నారు.

# గ్రామానికో నర్సరీ ఏర్పాటుకు కృషి

జనగామ,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): నూతన పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గ్రామానికో నర్సరీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈమేరకు నిధులను సైతం మంజూరు చేశారు. విత్తనాలను సైతం పంపిణీ చేస్తున్నారు. హరిత తెలంగాణ సాకారం కోసం ప్రభుత్వం పంచాయతీకో నర్సరీని ఏర్పాటు చేస్తోంది. మొక్కలు పెంచాలి..పచ్చదనం పెరగాలన్నా సకాలంలో వానలు కురియాలనే ఉద్దేశంతో తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈసారి మహిళలకు అవసరమయ్యే పలు రకాల పూల మొక్కలను పెంచుతున్నారు. నర్సరీలో మొక్కలను పెంచడానికి విత్తనాలు అందజేస్తు న్నామని అధికారులు అన్నారు. గ్రామాల్లో నర్సరీల ఏర్పాటు పూర్తయ్యాయని తెలిపారు. ఇళ్ల ఎదుట, పొలాల వద్ద నాటడానికి అనువైన మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నామన్నారు. కుక్కుడు, సీతాఫల్, మలబార్ వేప, కానుగ, ఎర్రచందనం, శ్రీగంధం, టెకోర్, అడవితంగేడు, వేదురు, గోరింటాకు, పారిజాతం, కర్జూరా, చింత, మునగా, వెలగ, జామా, బొప్పాయి, తదితరల మొక్కల విత్తనాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఉపాధి పనుల్లో కానరాని చిత్తశుద్ధి

## ఆందోళనలో ఉపాధి కూలీలు

కరీంనగర్,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): జిల్లాలో మందకొడిగా సాగుతున్న ఉపాధి పనులు కూలీలను అసంతృప్తికి గురి చేస్తున్నాయి. అటు రైతులు, ఇటు కూలీలకు వెన్నుదన్నుగా నిలవాల్సిన ఉపాధి హామీ పథకం ఆదుకున్న దాఖలాలు కనిపించడం లేదు. దీంతో జీవనాధారం కోసం కూలీలు సమీప పట్టణాలకు వలస వెళ్లే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే కూలీల కోసం ఏర్పాటు చేసిన ఉపాధి హామీ కూలీ పనులను వేగవంతం చేస్తామని అధికారులు అన్నారు. ఇప్పటి వరకు గ్రామాల్లో పనులు ప్రారంభించని క్షేత్ర సహాయకులకు తాఖీదులు పంపిస్తున్నామన్నారు. గ్రామీణ కూలీలు పట్టణాలకు వలసపోకుండా గ్రామంలోనే పనులకు పురమాయించనున్నట్లు వెల్లడించారు. గ్రామీణులకు పనులను కల్పించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. కొన్ని గ్రామాల్లో ఏడాది ముగింపునకు వచ్చినా ఉపాధి హామీ పనులను అధికారులు ప్రారంభించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. మరోవైపు పనులు ప్రారంభించిన గ్రామాల్లో వేగవంతంగా జరగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో క్షేత్ర సహాయకులు కూలీలకు పనులు చూపించటానికి ముందుకు రావటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. చిన్న చిన్న గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించటంతో క్షేత్ర సహాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కూలీలు ఆందోళన చెందుతున్నారు. గ్రామ సభలను నిర్వహించిన అధికారులు రైతులకు ఉపయోగపడే పనులను ఉపాధి హామీ పథకం కింద ఎంపిక చేశారు. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో రైతులు పనుల కోసం ముందుకు రావటం లేదు. దీంతో ఉపాధి హామీ పనులు నిలిచిపోయాయి. ఇది పేద కూలీలపై ప్రభావం చూపుతోంది. గ్రామ సభల్లో ఎంపిక చేసిన పనుల గురించి అధికారులు ఆయా గ్రామాలకు చేరుకొని రైతులకు వివరించాల్సి ఉంది. అధికారులు గ్రామ రైతులు, పెద్దల సమక్షంలో వారికి పనులతో ఒనగూరే ప్రయోజనాలు వివరించాలి. పనులను చేపట్టే విషయమై అవగాహన కల్పించని కారణంగానే రైతులు పనులను చేపట్టటానికి ముందుకు రావటం లేదని తెలుస్తోంది.. కొన్ని ప్రాంతాల్లో అవగాహన కల్పించినా చేసిన పనులకు సమయానికి డబ్బులు రావనే అపోహతో కూలీలు పనులకు రావటం లేదు.రానున్న వేసవిలో చేతి నిండా పని కల్పిస్తేనే కూలీలు పట్టణాలకు వలస వెళ్లకుండా ఉంటారు.

# ఆరుతడి పంటలకు దూరం

## -జిల్లాలో పెరిగిన వరినాట్ల జోరు

నల్లగొండ,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): జిల్లాలో ఈ యాసంగిలో పంటల సాగు విస్తీర్ణం జోరుగా పెరుగుతోంది. ఆరుతడి పంటలు సాగు చేయాలని ప్రభుత్వం చెబుతున్నా జిల్లాలో రైతులు అధికంగా వరిసాగు చేపడుతున్నారని జిల్లా వ్యవసాయాధికారులు అన్నారు. నీటి వసతులు పెరగడం కూడా కారణంగా భావిస్తున్నారు. నీరు,ఉచిత విద్యుత్ అందుబాటులోకి రావడంతో వ్యవసా సాగు పెరిగింది. రైతులు వివిధ పంటలను వేయగలిగారు. ప్రస్తుతం వరి నాట్లు చివరి దశకు చేరగా.. ఈ నెలాఖరు వరకు నువ్వులు, పెసలు, మినుము తదితర పంటలు విత్తుకోవడానికి అనువైన సమయం ఉంది. దీంతో సాగు వందశాతం చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ యాసంగిలో జిల్లా రైతులు వరితోపాటు మొక్కజొన్న, జొన్న, పెసర, మినుము. తదితర పంటలు సాగు చేస్తున్నారు. పత్తికి అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ తగ్గిందని ధరలు తగ్గుతాయని ప్రభుత్వం ప్రచారం చేసింది. దీంతో ఖరీఫ్‌లో పత్తి సాగు తగ్గి కంది సాగు పెరిగింది.సాగర్ నీరు విడుదల చేస్తామనడంతో అందుకు తగ్గట్లుగానే తక్కువ వ్యవధిలో పండే వరి నాట్లు వేశారు. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. బోర్లు, బావుల ఆధారంగా కొందరు సాగు చేస్తుండగా మరికొందరు కేవలం సాగర్ నీరే లక్ష్యంగా నాట్లు వేస్తున్నారు. మరోవైపు పెట్టుబడులు పెరుగుతున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. మరోపని చేయలేని రైతులు చేసేదేమి లేక అడిగినంత ఇచ్చుకుని నాట్లు వేయించుకుంటున్నారు. ఈ ఏడాది కూలీల సమస్యతో చాలా ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రభుత్వం పంటకు గిట్టుబాటు ధరలు పెంచడం లేదు కానీ పెట్టుబడులు మాత్రం విపరీతంగా పెరిగాయి. కొందరు రైతులు తప్పనిసరై అధిక కూలీ ఇచ్చి నాటు వేయించుకున్నారు. సన్నకారు రైతులు ఈయేడు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# యాదాద్రిలో వైభవంగా నిత్య పూజలు

## శివరాత్రి ఉత్సవాలకు ముందస్తు ఏర్పాట్లు

యాదాద్రి,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): పంచనారసింహుడిగా విరాజిల్లు తున్న యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో నిత్యకల్యాణ వేడుకలు అత్యంత వైభవంగా జరిగింది. రోజూ ఒక్కో రకమైన పూజలు నిర్వహిస్తూ భక్తులు లక్ష్మీనృసింహుడిని కొలుస్తున్నారు. వేకువ జాము నే స్వయంభులకు, బాలాలయ కవచమూర్తులకు ఆరాధనలు జరిపి ఉత్సవ మండపంలో ఉత్సవ విగ్రహాలను పంచామృతాలతో అభిషేకించి, తులసి అర్చనలు జరిపారు. అనంతరం లక్ష్మీ నరసింహులను దివ్య మనోహరంగా అలంకరించి సుదర్శన నా రసింహహోమం అనంతరం లక్ష్మీనరసింహుల కల్యాణం జరిపారు. స్వామివారి అలంకార సేవోత్సవాలతో పాటు అష్టోత్త రంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కొండపై శివాలయంలో నిత్యారాధనలు శైవ సంప్రదాయంగా జరిగాయి. అమ్మ వారికి కుంకుమార్చనలు నిర్వహించారు. సత్యనారాయణ స్వామి వారి వ్రత పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఇకపోతే యాదాద్రి పుణ్యక్షేత్రంలో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించబోతున్నారు. ప్రముఖ క్షేత్రమైన యాదాద్రిలో హరిహరుల ఆలయాలు నిత్యపూజలతో విరాజిల్లుతున్నాయి. వార్షిక ఉత్సవాలు నిర్వహించడం ఈ క్షేత్ర ఆచారం. స్థానిక రామలింగేశ్వరుడి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం సన్నద్ధమైంది. ఆ

క్రమంలోనే శివరాత్రి మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా దర్శనాలకై ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నామని అన్నారు. ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో చెప్పారు.

# ఉభయతెలుగు రాష్ట్రాల్లో మోగిన ఎమ్మెల్సీ నగారా

## మార్చి 14న పోలింగ్ జరిపేందుకు ఇసి షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం షెడ్యూల్ విడుదలైంది. తెలంగాణలో రెండు పట్టభద్రుల, ఏపీలో రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ జారీ చేసింది. తెలంగాణలో ఖమ్మం - వరంగల్-నల్గొండ, మహబూబ్‌నగర్ - రంగారెడ్డి -హైదరాబాద్ పట్టభద్రుల స్థానాలకు ఈ నెల 16న ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానుండగా.. మార్చి 14న పోలింగ్ జరుగనుంది. నామినేషన్ల స్వీకరణకు ఈ నెల 23వ తేదీ వరకు గడువు ఇచ్చారు. 24న నామినేషన్లను పరిశీలించన్నారు. 26న నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు ఇచ్చారు. మార్చి 14న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. తెలంగాణలో ప్రస్తుత ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎన్.రామచంద్రరావు పదవీకాలం మార్చి 29వ తేదీతో ముగియనుంది.

# పరాకాష్టకు చేరిన సిఎం అహంకారం: బిజెపి నేత

నల్గొండ,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): సీఎం అహంకారం పరాకాష్టకు చేరిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొంగిడి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లాలోని బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం మొఖంలో ఆందోళన, అభద్రత కొట్టొచ్చినట్టు కనిపించిందన్నారు. టీఆర్ఎస్ నేతలు ఇష్టారీతిగా ప్రవర్తిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, గిరిజనులు, విద్యుత్ ఆర్టిజెన్ కార్మికులు ప్లకార్డులు పట్టుకుంటే వారిని కుక్కలతో పోల్చుతారా అని మనోహర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నాగోబా జాతర.. గిరిజనులకు మంత్రి సత్యవతి శుభాకాంక్షలు

హైదరాబాద్, ఫిబ్రవరి 11: గిరిజనులు అత్యంత పవిత్రంగా జరుపుకొనే నాగోబా జాతర నేటినుంచి ప్రారంభకానుంది. ఈనేపథ్యంలో మంత్రి సత్యవతి రాథోడ్ గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ జాతర ఆదిమ గిరిజనుల ప్రాచీన సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. ఆచార, సంప్రదాయాలకు గిరిజనులు ఇచ్చే ప్రాముఖ్యతకు ఈ జాతర అద్దం పడుతుందన్నారు. ఆదిశేషుడిని ఆరాధ్య దైవంగా కొలుస్తూ అత్యంత భక్తి, శ్రద్ధలతో ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో ఇవాళ రాత్రి నాగోబా మహాపూజతో జాతర ప్రారంభంకానుంది.

రాష్ట్రంలోని అన్ని వర్గాల పండుగలు, సంప్రదాయాలకు విలువనిస్తూ సీఎం కేసీఆర్ ప్రభుత్వం వాటిని గొప్పగా నిర్వహిస్తున్నదని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఇందులో భాగంగానే నాగోబా జాతరను కూడా సర్కారు అధికారికంగా జరుపుతున్నదని చెప్పారు. ఈ ఏడాది కరోనా నేపథ్యంలో జాతరలో నిర్వహించే గిరిజన దర్బార్, క్రీడా పోటీలను రద్దు చేసినట్లు మెస్రం వంశీయులు ప్రకటించారని వెల్లడించారు. ఆదివాసీల ఆరాధ్య దైవం ఆదిశేషును దర్శించుకునేందుకు, ప్రాచీన గిరిజన వంశీయులు అక్కడికి వెళ్లేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు.

వారం రోజుల పాటు కొనసాగనున్న ఈ జాతరలో గిరిజనులకు ఎలాంటి లోటు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారని వెల్లడించారు. మన రాష్ట్రంతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, జార్ఖండ్ నుంచి కూడా గిరిజనులు ఈ జాతరకు తరలి వస్తారని, దీనికి అనుగుణంగా రవాణా సదుపాయాలు కల్పించామన్నారు.

మెస్రం వంశీయుల ఇలవేల్పుగా నాగోబా ఉన్నారని, ఈ జాతరలో మెస్రం వంశీయులే పూజలు నిర్వహించే జాతర జరుపుతారని, గోండులు, పరధాన్, గిరిజన ఆదివాసీ తెగలంతా ఈ జాతరలో భక్తి, శ్రద్ధలతో పాల్గొంటారని వెల్లడించారు. మహాపూజకు 15 రోజుల ముందు నుంచే మెస్రం వంశీయులు పరధాన్‌లతో కలిసి కాలినడకన గోదావరి నుంచి పవిత్ర జలాలు తీసుకొచ్చి, నాగోబా ఆలయం మర్రిచెట్టు మీద ఉ ంచుతారని, మహాపూజలో ఆ పవిత్ర జలంతో అభిషేకం చేస్తారన్నారు. మెస్రం వంశ మహిళలు అక్కడి మట్టితో లింగాన్ని ప్రతిష్టించి పూజలు చేస్తారని, ఇంతటి విశిష్టమైన జాతర తెలంగాణలో జరుగుతున్నందుకు ఎంతో గర్విస్తున్నామని చెప్పారు.

# రైతులను విస్మరిస్తున్న ప్రభుత్వం: కాంగ్రెస్

నిజామాబాద్,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరిస్తోందని, అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారాయని కాంగ్రెస్ నేతతాహిర్ బిన్ హందాన్ అన్నారు. రైతులకు పూర్తిస్థాయి రుణమాఫీ అమలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమస్యలపై ప్రజా క్షేత్రంలో పోరుబాట పట్టాలని పార్టీ నేతలకు సూచించారు. మిషన్ కాకతీయ కింద చెరువులు ఎంపిక చేసి...ఇప్పటి వరకు ఎన్ని చెరువులు పూర్తిచేశారని అన్నారు. అనేక విడతలలో ఎన్ని చెరువులను ఎంపిక చేశారు... ఎంతమేర నిధులు కేటాయించారు... అందులో ఎన్ని చెరువులు పూర్తయ్యాయనేది ప్రజలకు వివరించాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీని వెంటనే పూర్తిగా అమలు చేయాలని అన్నారు. బ్యాంకుల రుణాలు ఇవ్వకపోవడంతో కొత్త రుణాలు అందక రైతులు ముందుకు వెళ్లలేని దుస్థితి నెలకొందని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వైఖరి కారణంగా రైతులు పోరాటాలు వదిలిపెట్టి రోడ్లపై ధర్నాలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు.

# ఘట్‌కేసర్ అత్యాచారం కేసు విచారణ వేగవంతం

## విచారణ అధికారిగా కీసర ఇన్‌స్పెక్టర్ నరేందర్ గౌడ్

## బాధితురాలిపై అత్యాచారం జరిగిందన్న డాక్టర్లు

హైదరాబాద్,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): ఘట్‌కేసర్ అత్యాచారం కేసు విచారణను కీసర పోలీసులు వేగవంతం చేశారు. విచారణ అధికారిగా కీసర ఇన్‌స్పెక్టర్ నరేందర్ గౌడ్‌ను నియమించారు. ఘట్‌కేసర్ సీఐ చంద్రబాబునాయుడు సెలవులో ఉండటంతో విచారణ అధికారిగా నరేందర్ గౌడ్‌ను రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్ నియమించారు. మరోవైపు బాధితురాలిని నారపల్లి క్యూర్ ఆస్పత్రి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం తిరిగి క్యూర్ ఆస్పత్రికి పోలీసులు తరలించనున్నారు. మత్తుమందు ఇచ్చి అమ్మాయిపై అత్యాచారం చేసే ప్రయత్నం చేసినట్లు పోలీసులు గుర్తించారు. బాధితురాలు స్పృహలోకి వచ్చిన తరువాత నిందితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత నలుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నలుగురు నిందితులపై 365 సెక్షన్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుగుతున్నారు. గురువారం క్యూర్ హాస్పిటల్ డాక్టర్ రఘువీర్ రెడ్డి, మేడ్చల్ వెల్ఫేర్ అధికారి జ్యోతి పద్మ మీడియాతో మాట్లాడారు. ఫార్మసీ విద్యార్థిని బుధవారం రాత్రి 8.20 గంటలకు పోలీసులు తమ ఆస్పత్రిలో చేర్పించారని రఘువీర్ రెడ్డి తెలిపారు. అప్పటికే బాధితురాలు అపస్మారక స్థితిలో ఉందని, ఒంటిపై కొన్ని చోట్ల గాయాలు అయ్యాయన్నారు. రాత్రంతా చికిత్స రహితంగా విద్యార్థినిపై దాడి చేయడంతో కాలి గాయం అయ్యిందన్నారు. సీనియర్ గైనకాలజిస్ట్ అన్ని వైద్య పరీక్షలు చేశారన్నారు. ప్రస్తుతం విద్యార్థిని పరిస్థితి బాగానే ఉందన్నారు. వైద్య పరీక్షల కోసం పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థినిపై లైంగికదాడి యత్నం జరిగిందని బాధితురాలికి చికిత్స అందించిన క్యూర్ హాస్పిటల్ డాక్టర్ సౌజన్య రెడ్డి తెలిపారు. ఒక్కరు కాదు ముగ్గురు దుండగులు ఉన్నారని బాధితురాలు చెప్పినట్లు పేర్కొన్నారు. ఆస్పత్రికి వచ్చినప్పుడు స్పృహ లేకుండా ఉందని, పోలీసులే ఆమెను తీసుకొచ్చారన్నారు. ఫార్మసీ విద్యార్థిని విషయం తెలియగానే హాస్పిటల్‌కు చేరుకున్నామని మేడ్చల్ వెల్ఫేర్ అధికారి జ్యోతి పద్మ తెలిపారు. మంత్రి ఆదేశాలతో మెరుగైన చికిత్స కోసం తరలించారని, ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్యం బాగానే ఉందన్నారు. మహిళలపై దాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫార్మసీ విద్యార్థిని పైన అత్యాచారం జరిగిందా లేదా అనేది రిపోర్టులు వచ్చాక వెల్లడిస్తామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే వ్యక్తుల్లో, వ్యవస్థల్లో మార్పు రావాలని అన్నారు. పోలీసులు సకాలంలో స్పందించడంతో విద్యార్థిని క్షేమంగా ఉందన్నారు. ఘటకేసర్ ఘటన పైన స్త్రీ శిశు సంక్షేమ శాఖ కు రిపోర్ట్ అందిస్తామని వెల్లడించారు.

# కలకలం సృష్టిస్తున్న సిఐ ఆత్మహత్యాయత్నం

జయశంకర్ భూపాలపల్లి,ఫిబ్రవరి11 (ఆర్ఎన్):జిల్లాలో సీఐ సాయిరమణ ఆత్మహత్యాయత్నం కలకలం రేపుతోంది. సూసైడ్ నోట్ రాసి తన కారులోనే పురుగుల మందు తాగాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల పోలీస్ స్టేషన్లో సీఐగా పనిచేస్తున్న సాయిరమణ కుటుంబంతో కలిసి వరంగల్ లో ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం ఒంటరిగా కారులో బయల్దేరిన సీఐ కారులోనే పురుగుల మందు తాగాడు. అటుగా వెళ్తున్న పెట్రోలింగ్ సిబ్బంది గమనించి హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు చికిత్స అందిస్తున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు చెప్పారు. కుటుంబ కలహాలు,ఆర్థిక సమస్యల కారణమని సూసైడ్ నోట్ లో ఉన్నట్లు కేయూసీ పోలీస్ స్టేషన్ సీఐ జనార్ధన్ రెడ్డి గుర్తించారు.

# ఫుట్‌బాల్ ప్లేయర్ సౌమ్యకు కవిత శుభాకాంక్షలు

హైదరాబాద్,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ జిల్లాకు చెందిన ఫుట్‌బాల్ ప్లేయర్ గుగులోత్ సౌమ్య జాతీయ ఫుట్‌బాల్ టీమ్‌కు ఎంపికైన విషయం తెలిసిందే. తెలంగాణ నుంచి తొలి క్రీడాకారిణిగా సౌమ్య అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా సౌమ్యకు టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అభినందనలు తెలుపుతూ ట్వీట్ చేశారు. నిజామాబాద్ బిడ్డ గుగులోత్ సౌమ్య, కేవలం పందొమ్మిదేళ్లకే ఫుట్ బాల్ భారత సీనియర్ మహిళల జట్టుకు ఎంపికవడం తెలంగాణకు గర్వకారణం. సౌమ్యకు అభినందనలు తెలియజేస్తూ, మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నాను అని కవిత పేర్కొన్నారు.

# గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పనులపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమీక్ష



వరంగల్ అర్బన్, ఫిబ్రవరి 11: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పనులపై మేయర్ గుండా ప్రకాశ్ రావు, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, కమిషనర్ పమేలాతో కలిసి హన్మకొండ లోని తన క్యాంప్ కార్యాలయం అర్ అండ్ బీ అతిథి గృహంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రోడ్లు, డ్రైనేజీలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.100 కోట్లతో ఫ్లడ్ రిలీఫ్ వర్క్స్ ని చేపట్టాలన్నారు. అలాగే టెండర్లు పూర్తి చేయాలని, టెండర్లు పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రి సూచించారు. రూ.36కోట్లతో మడికొండలో చేపట్టిన బయో మైనింగ్ డంపింగ్ యార్డు పనులను చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 51మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లను నియమించే ప్రక్రిను వేగవంతం చేయాలని చెప్పారు. మడికొండలోని ఐటీ ఏరియాలో త్రీ స్టార్ హోటల్ నిర్మాణం కోసం 10ఎకరాల స్థలం సేకరించాలని సూచించారు. మామునూరు విమానాశ్రయానికి రైతులు – ప్రభుత్వానికి మధ్య స్థల మార్పిడితో అవసరమైన పూర్తి స్థల సేకరణ పై కేంద్రానికి రాసిన లేఖకు రెండు మూడు రోజుల్లో అనుమతులు వస్తాయని పేర్కొన్నారు. అవి రాగానే విమానాశ్రయ స్థలాన్ని అప్పగిస్తామని మంత్రికి అధికారులు వివరించారు. మరోవైపు నగరంలో ఓపెన్ జిమ్‌లు, 38 జనీక్షన్ల, గ్రీన్ జంక్షన్ల ఏర్పాటు, లక్ష్మీపురంలో సమగ్ర వెజ్, నాన్ వెజ్ మార్కెట్ల ఏర్పాటు, నైట్ షెల్టర్లు, సెంట్రల్ లైటింగ్ డివైడర్స్ కలరింగ్, ఆర్ట్స్ కాలేజ్, పబ్లిక్ గార్డెన్స్ వంటి చోట్ల వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు వంటి పలు అంశాల్లో అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పోతన ఆడిటోరియం పునరుద్ధరణ, కాళోజీ కళాక్షేత్రం, ఏకశిలా పార్క్, భద్రకాళి బండ్, ఓరుగల్లు చరిత్ర, పూర్వ వైభవాన్ని చాటి చెప్పే, నగరానికి నాలుగు వైపుల స్వాగత తోరణాల ఏర్పాటు వంటి అనేక అంశాలను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమీక్షించారు. అసంపూర్తిగా ఉన్న అన్ని పనులను తక్షణమే చేపట్టి వేగంగా పూర్తి చేయాలని మంత్రి అదేశించారు.

# వైభవంగా శ్రీ రామలింగేశ్వరస్వామి జాతర

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 11 : (నేటినిజం ప్రతినిధి):వేములవాడ అర్బన్ మండలం కొడుముంజగ్రామంలో వెలసిన రామప్ప శ్రీ రామలింగేశ్వరస్వామి జాతర కళ్యాణం గురువారం అత్యంత వైభవంగా జరిగింది, ప్రతి సంవత్సరం మాఘ అమావాస్య రోజున స్వామి వారి జాతర ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది, వేకువ జామున స్వామివారికి గ్రామ సర్పంచి సర్పంచ్ రాజ్ కుమార్ ఉపసర్పంచ్ ఉమా ప్రశాంత్ దంపతులు, ఆలయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ జాతర మహోత్సవ వేడుకల్లో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం ఏనుగు మనో హర్ రెడ్డిని సర్పంచ్ రాజ్ కుమార్ శాలువతో సత్కరించారు .జాతరకు వచ్చే భక్తులకు ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పా ట్లను చేశారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు రాంరెడ్డి , సంకె పల్లి సర్పంచ్ జింక వేణు, ఉప సర్పంచ్ ఉమా ప్రశాంత్ వార్డు సభ్యులు సాయిని వేణు , గుంటి నాగరాజు ,గడారివిష్ణు, పొన్నం అంజయ్య, లక్ష్మీరాజం చిగుర్ల పర్శరాములు, వికృతి సాయిలుఎత్తున భక్తులు పాల్గొన్నారు,

# దుబ్బ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న ఏనుగు మనోహర్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 11 : (నేటినిజం ప్రతినిధి): వేములవాడ రూరల్ మండలంలోని నాగయ్యపల్లి గ్రామంలో శ్రీ దుబ్బ రాజరాజేశ్వర ఆలయంలో స్వామివారిని గురువారం టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి దర్శిచుకోవడం జరిగింది . అనంతరం మాట్లాడుతూ అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని పాడి పంటలు సమృద్ధిగా పండి రైతు జీవితాల్లో వెలుగులు నిండాలని అందరికీ మంచి జరగాలని స్వామి వారిని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఏనుగు మనోహర్ రెడ్డి ని గ్రామ సర్పంచ్ సుమన్ శాలువ కప్పి వారికి స్వామి వారి ప్రసాదం అందజేశారు. ఆయన వెంట టీఆర్ఎస్ వై మండల కార్యదర్శి చెట్టిపల్లి నరేష్,గ్రామ అధ్యక్షుడు కోరే తిరుపతి,కచ్చు పర్శరాములు, గోపుసంజీవ్, అంజి, రాజు,చంద్రమౌళి, పర్శారములు తదితరులు ఉన్నారు.

# కోడుముంజ రామప్ప రామలింగేశ్వర స్వామి జాతర మహోత్సవంలో పాల్గొన్న ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 11 : (నేటినిజం ప్రతినిధి): ఈరోజు వేములవాడ అర్బన్ మండలం కొడుముంజ గ్రామంలో శ్రీ రామప్ప రామలింగేశ్వర స్వామి జాతర కార్యక్రమంలో కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు ఆయన వెంట గ్రామ సర్పంచ్ రాజ్ కుమార్, ఉపసర్పంచ్ రాగుల ఉమా ప్రశాంత్, అర్బన్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు పిల్లి కనకయ్య, సర్పంచ్ పండుగ ప్రదీప్,ఎంపీటీసీ బాస రాజశేఖర్, నాగుల ప్రశాంత్, పొన్నం ప్రశాంత్, తదితరులు ఉన్నారు

# కేంద్ర నిధులతోనే రైతువేదికలు: బిజెపి

నల్గొండ,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): కేంద్రం నిధులతోనే రైతు వేదికలను రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లాలోని బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల్లికల్లు లిఫ్ట్‌ను కుదించి సీఎం కేసీఆర్ గిరిజనులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. 25వేల ఆయకట్టును 4 వేల ఆయకట్టుకు కుదించారన్నారు. ఏడేళ్లుగా ఇవ్వని రేషన్ కార్డులు ఇపుడు ఇస్తారంటే ప్రజలు నమ్మరని చెప్పారు. సాగర్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో లబ్ది పొందడానికి టీఆర్ఎస్ డ్రామాలు ఆడుతుందని శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఇకపోతే కేసీఆర్‌కు ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హత లేదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్ అన్నారు. కేసీఆర్ అహంకారానికి నాగార్జున సాగర్ ప్రజలే బుద్ధి చెబుతాం న్నారు. సాగర్‌లో సీఎం మీటింగ్‌తోనే అర్థమైందని చెప్పారు. సాగర్‌లో బీజేపీదే గెలుపని శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. సాగర్‌లో టీఆర్ఎస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. సాగర్‌లో గెలవడానికి టీఆర్ఎస్ డ్రామాలు ఆడుతుందని దీనిని ప్రజలు గమనించాలని మాదగోని శ్రీనివాస్ అన్నారు.

# బెజవాడలో పోకిరీలకు చెక్

## ఫలిస్తున్న పోలీసుల వ్యూహం

విజయవాడ,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): పోకిరీల పని పట్టేందుకు విజయవాడ పోలీసులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. గట్టిగా హెచ్చరించడం, కేసులు పెట్టడం లాంటి చర్యలతో వీరు దారికొస్తున్నారు తమను క్షమించి ఒక్క అవకాశం ఇస్తే మారిపోతామంటూ కాళ్ల బేరానికి వస్తున్నారు.విజయవాడ పోలీసులు ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన మహిళా బృందాల వల్ల సత్ఫలితాలు ఇస్తున్నాయి. బెజవాడలో రౌడీయిజానికి, పోకిరీల చేష్టలకు తావులేకుండా పోతోంది. ఏళ్ల తరబడి బస్టాండ్ల వద్దే కాపుకాసి.. అమ్మాయిలను ఏడిపించే చర్యలకు అడ్డుకట్ట పడింది. ఆడపిల్లలను అసభ్య పదజాలంతో పిలవడం, రివ్వున మోటారుసైకిల్‌పై దూసుకుపోతూ యువతుల ముందు ఒక్కసారిగా బ్రేక్ వేసి భయపెట్టడం లాంటి చర్యలకు బ్రేక్ పడింది. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రద్దీ ప్రాంతాలు సహా ఎక్కడ మహిళలు, యువతులు, విద్యార్థినులు కనిపించినా ఏదోరకంగా వేధించడమే పనిగా పెట్టుకున్న వారికి పోలీసులు లాఠీ రుచి చూపించారు. వారి భవిష్యత్తు దృష్ట్యా పోలీసులు సైతం కౌన్సెలింగ్ నిర్వహించి వదిలిపెడుతున్నారు. వెంటపడడం చేస్తుండే పోకిరీల బెడద తీవ్రరూపం దాల్చింది. రోజూ తల్లిదండ్రులు, పోకిరీల మధ్య వాగ్వాదం జరుగుతూనే ఉండేది. అమ్మాయిల కోసం యువకులు కొట్లాటలకు దిగిన సంఘటనలూ ఉన్నాయి. వీటిపై ప్రస్తుతం పోలీసులు దృష్టి సారించడంతో పోకిరీల బెడద చాలావరకూ తగ్గింది. తల్లిదండ్రులు సైతం పోలీసుల తీరును ప్రశంసిస్తున్నారు. రంగంలోనికి దిగిన మహిళా రక్షక్ బృందాలు.. అన్ని ప్రాంతాలలోనూ కాపు కాస్తున్నాయి. నిఘా కెమెరాలతోనూ పర్యవేక్షిస్తున్నారు. యువతులను వేధిస్తోన్న దృశ్యాలను రహస్యంగా చిత్రీకరించి.. ఆధారాలు సేకరించిన అనంతరం వారిని పోలీస్ తరహాలో బుద్ధి చెబుతున్నారు. కేసులను నమోదు చేయడం కంటే తొలి తప్పుగా.. బంధువులు, సన్నిహితులు, తల్లిదండ్రులను పిలిపించి వారి సమక్షంలోనే సన్మార్గంలోనికి మళ్లించేలా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. వీరికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. నడవడిక మార్చుకోవాలని పోలీసులు గట్టిగా హెచ్చరిస్తున్నారు.

# రైతు ఉద్యమాన్ని అవమానిస్తున్న ప్రధాని

## విశాఖ ఉక్కుపై కేంద్ర తీరు అనుమానాస్పదం

## మండిపడ్డ సిపిఐ కార్యదర్శి రామకృష్ణ

విజయవాడ,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): రైతుల ఉద్యమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అవమానిస్తున్నారని సీపీఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంటులో అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, రైతుల సంక్షేమం కోసం చట్టాలు తెచ్చామని చెప్పడం సిగ్గు చేటన్నారు. కనీస మద్దతు ధర నిర్దేశిస్తూ చట్టం ఎందుకు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. 'అన్నీ నాకే తెలుసు, నేనేదైనా మాట్లాడవచ్చు అనేలా మోదీ తీరు ఉంది.. ప్రధాని నిరంకుశ, నిర్లక్ష్యం వల్లే 200 మంది రైతులు అక్కడ చనిపోయారు.. దేశ వ్యాప్తంగా 18వ తేదీన రైల్ రోకో నిర్వహిస్తున్నారు.. సీపీఐ ప్రత్యక్షంగా ఆ ఆందోళనలో పాల్గొంటుందని రామకృష్ణ స్పష్టం చేశారు.విశాఖ ఉక్కు ఫ్యాక్టరీపై పార్లమెంటులో కేంద్ర మంత్రి చేసిన ప్రకటన కూడా అనేక అనుమానాలు కలిగిస్తోందని రామకృష్ణ అన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డికి తెలియకుండా ఈ ఒప్పందం జరిగిందా?.. పోస్కో సంస్థ ప్రతినిధులతో సిఎం భేటీ అయ్యింది నిజమే కదా? అని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ జరిగితే... అన్ని పక్షాలు చరిత్ర హీనులుగా మిగులిపోతారన్నారు. 28 మంది ఎంపీలు ఉన్న వైసీపీకి పీఎం అపాయింట్మెంట్ దొరకదా? జగన్మోహన్ రెడ్డి వెంటనే స్పందించి ప్రధానిని కలవాలని, విశాఖ ఉక్కును రక్షించేలా ప్రభుత్వ పరంగా చర్యలు చేపట్టాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

# కరవు నివారణలో సర్కార్ విఫలం: కాంగ్రెస్

అనంతపురం,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): జిల్లాలో కరువు నివారణ చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని డీసీసీ అధ్యక్షులు కోటా సత్యం విమర్శించారు. యంత్రాలతో పనులు చేయిస్తూ కూలీల కడుపు కొడుతున్నారన్నారు. ఫలితంగా కూలీలు వలస వెళ్తున్నారని చెప్పారు. పశుగ్రాసం లేక పశువులు కబేళాలకు తరలుతన్నాయని చెప్పారు. హంద్రీనీవా పనులు నత్తనడకన సాగుతున్నాయని చెప్పారు. మంత్రుల మాటలే తప్ప చేతల్లో పనులు చేయడం లేదన్నారు. నీటి కొరతతో పూత దశలో ఉన్న వేరుశనగ పంటను పలుచోట్ల రైతులు దున్నేశారని అన్నారు. పంటను కాపాడుకోవడానికి బోర్లు వేసిన రైతులు నష్టపోయారని అన్నారు.బోర్లలో నీరు రాకపోవటంతో చేసేది లేక పంటను దున్నేశారని అన్నారు.

# శరవేగంగా సర్కార్‌వారి పాట షూటింగ్

సర్కారు వారి పాట..గీతగోవిందం లాంటి హిట్ సినిమా తర్వాత పరశురాం తీస్తున్న చిత్రం కావడం, సూపర్‌స్టార్ మహేశ్‌బాబు హీరోగా నటిస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై భారీగా అంచనాలు ఏర్పడ్డాయి.

దూకుడులో కామెడీ ట్రాక్ మామూలుగా ఉండదు. ఇపుడు ఇదే ఫార్ములాను పరశురాం సర్కారు వారి పాట చిత్రంలో కూడా పెడుతున్నాడని చిత్రయూనిట్ మెంబర్స్ తెలిపినట్టు ఓ వార్త ఫిలింనగర్ లో చక్కర్లు కొడుతోంది. ఒకవేళ ఇదే నిజమైతే మహేశ్ మాస్ యాంగిల్, కామెడీ టచ్ మరోసారి తెలుగు ప్రేక్షకులను పసందైన వినోదాన్ని అందించడం ఖాయమైనట్టే. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ చిత్రంలో మహేశ్ మాస్ అవతార్‌లో కనిపించనున్నాడు. కీర్తిసురేశ్ హీరోయిన్ గా నటిస్తోంది. ప్రస్తుతం దుబాయ్‌లోని అందమైన లొకేషన్లలో పరశురాం అండ్ టీం కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు.ఈ మూవీకి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ ఒకటి ఫిలింనగర్ లో చక్కర్లు కొడుతోంది. మహేశ్ కెరీర్‌లో దూకుడు సినిమా ఎంత బ్లాక్ బాస్టర్ హిట్‌గా నిలిచిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. శ్రీనువైట్ల డైరెక్షన్‌లో వచ్చిన ఈ చిత్రానికి అవార్డుల పంట పండటంతోపాటు రికార్డుల వర్షం కురిపించింది. ఇపుడు సర్కారు వారి పాటకు దూకుడు చిత్రాన్ని లింకప్ చేస్తూ వార్తలు తెరపైకి వస్తున్నాయి. ఇంతకీ దూకుడు, సర్కారు వారి పాటకు మధ్య కనెక్షన్ ఏంటీ అనుకుంటున్నారా..? ఏం లేదండి..

# బోయపాటి-బాలయ్య కాంబో చిత్రం పేరు ఏంటబ్బా

## సినీ వర్గాల్లో రకరకాల ఊహాగానాలతో చర్చలు

నందమూరి బాలకృష్ణ, బోయపాటి కాంబోలో మూడో సినిమా ప్రకటించినప్పటి నుంచి సినిమా హాట్ టాపిక్‌గా ఉంది. మొదట హీరోయిన్ గురించి, ఆ తరువాత విలన్ గురించి ఇప్పుడు తాజాగా సినిమా పేరు గురించి అభిమానుల్లో అనేక సందేహాలు రేకెత్తుతున్నాయి. అయితే ఈ సినిమాలో ప్రగ్యాజేశ్వాల్ హీరోయిన్‌గా చేస్తుండగా బాలీవుడ్ నటుడు సునీల్ శెట్టి విలన్ పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రం మే28న ప్రేక్షకుల ముందుకు రానుందని కూడా ప్రకటించారు. అన్ని ఓ కొలిక్కి వచ్చినా సినిమా పేరు మాత్రం ÷నైల్ కాలేదు. అయితే ఇటీవల ఈ సినిమాకి మోనార్క్ అనే పేరును ఖరారు చేశారని వార్తలు రావడంతో బోయపాటి వాటిపై స్పందించారు. ముందు సినిమా పూర్తి కావాలని, ఆ తరువాత సినిమా పేరు విషయంపై దృష్టి పెడతానని అన్నారు. అంతేకాకుండా వస్తే అప్‌డేట్ త్వరలో రావచ్చని కూడా అన్నారు. ఈ క్రమంలో ఈ సినిమాకు మరో పేరు ప్రచారంలోకి వచ్చింది. ఇప్పుడు ఈ సినిమాకు ధర్మ అనే పేరు ఫిక్స్ చేసేందుకు బోయపాటి చూస్తున్నారని వార్తలు సినీ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ మేరకు ఇప్పటి వరకు ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల కాలేదు. అతి త్వరలోనే సినిమా పేరును అనౌన్స్ చేయనున్నారని తెలుస్తోంది. ఇకపోతే ఇదిలా ఉంటే ఈ సినిమాలో నందమూరి నటసింహం ఓ పవర్ ఫుల్ ఐఏఎస్ అధికారిగా కనిపించనున్నారని సామాచారం. బాలకృష్ణ పోలీస్ ఆఫీసర్ పాత్ర అనేసరికి అభిమానులకు పూనకాలు వస్తున్నాయి. మరి బోయపాటి–బాలయ్య కాంబో ప్రేక్షకులను ఏ మాత్రం అలరిస్తారో చూడాలి.

# ప్రజలంటే ఇంత చులకనా ?

## వారిని కుక్కలతో పోలుస్తారా: పొన్నం

వరంగల్,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రజలను కుక్కలతో పోల్చిన సీఎం కేసీఆరే పెద్ద కుక్క అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. భీమదేవరపల్లి మండలంలో పొన్నం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు చెప్పుకుందామని సభకు వస్తే ప్రజలను కుక్కలతో పోల్చుతావా అని కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు సిగ్గు, మానం, ఇజ్జత్ లేదని పొన్నం అన్నారు. తెలంగాణ ప్రజలను కుక్కలతో పోల్చిన సీఎం ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా ప్రజలందరి ముందు ముక్కు నేలకు రాయాలని పేర్కొన్నారు. తమ సమస్యలను చెప్పుకుందామని ప్రగతి భవన్, ఫామ్‌హౌస్, సచివాలయానికి ప్రజలు వస్తే వారిని ఇంతవరకు కలువనే లేదని ఆయన కేసీఆర్‌పై ధ్వజమెత్తారు. అలాంటప్పుడు ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని కేసీఆర్‌ను ప్రశ్నించారు. అంత:పుర కలహాలకు వేదికగా ప్రగతిభవన్ మారిందని పొన్నం ఆరోపించారు. సీఎం కేసీఆర్‌ను కొడుకు బాధ్యతగా ఫాగల్ ఆసుపత్రికి ఆసుపత్రికి తీసుకెళ్లాలని మంత్రి కేటీఆర్‌కు ప్రభాకర్ సూచించారు మోదీ, కేసీఆర్‌లు రైతులను నిలువునా మోసగిస్తున్నారని పొన్నం విమర్శించారు. వ్యాపారుల లాభం కోసమే మోదీ వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చారని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను కేసీఆర్ పక్కకు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రజల కోసం, రైతుల కోసం మంచి చేస్తే అండగా ఉంటామని, మోసం చేస్తే రైతుల తరపున టీఆర్ఎస్ పాలకులపై పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# మీడియాపై పాలకుల పెత్తనం

## -వ్యతిరేక వార్తలు రాకుండా జులుం: ఉత్తమ్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి11(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ప్రజాస్వామ్యం దెబ్బతిందని.. పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా పై పాలకుల పెత్తనం పెరిగిపోయిందని తెలంగాణ కాంగ్రెస్ పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రజా సమస్యలు, ప్రతిపక్ష నేతల వార్తలకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. వ్యవసాయ బిల్లుల వల్ల ఎలాంటి నష్టం లేదని మోడీపదే, పదే చెప్తున్నారని, మోడీ, అమిత్ షాలను కలిసాక కేసీఆర్ తెలంగాణలో పంటల కొనుగోలు కేంద్రాలను రద్దు చేశారన్నారు. వ్యవసాయ బిల్లుల వల్లనే కొనుగోలు కేంద్రాలు రద్దు చేశామని కేసీఆర్ అంటున్నా,ఈ విషయాన్ని మీడియా ఎక్కువగా ప్రచారం చేయ లేదన్నారు. ఇదే విషయంపై తాను లోకసభలో మాట్లాడినా కూడా పెద్దగా ప్రచురణ కాలేదన్నారు. హాలియ సభలో వినతి పత్రం ఇవ్వడానికి వచ్చిన వారిని సీఎం కేసీఆర్ కుక్కలు అని దిగజారి పోయి మాట్లాడినా కూడా పత్రికలలో పెద్దగా రాలేదన్నారు. ఇలాంటి విషయాల్లో ఎందుకనో పెద్దగా పట్టించుకోవడం లేదన్నారు. నిజాలు రాయడానికి ఎప్పుడూ ముందుండాలని అన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.